# సమర్ధ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 36 సంచిక 7

పేజీలు 40

మార్చి 2017

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................. ....... పేజీ**

భద్రవాక్యం ....................2
శ్రీబాబూజీ ఉవాచ....................4
అమ్మమాట....................7
వాచ్యార్థం - లక్ష్యార్థం ....................9
కృష్ణం వందే జగద్గురుమ్ ....................11
కఠోపనిషత్ ....................12
త్రిపురా రహస్యం ....................14
సమర్థ సద్గురు యాజమాన్యం వివరాలు.................... 16
భయంకర విషసర్పము ....................17
బాటసారి భాగ్యము ....................18
పుణ్యుడు - పాపనుడు ....................19
దేవి ఎవరు?....................20
యోగవాశిష్ఠము ....................22
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................24
పరిప్రశ్న ....................25
నా అనుభవాలు.................... 27
అరుణాచలం (తిరువణ్ణామలై) ....................29
శ్రీకృష్ణకర్ణామృతము....................31
ఉదంకుని మేఘాలు ....................32
విశ్వామిత్రుడు....................35
సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర.....37
విష్ణు కథలు- మీరాబాయి....................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

ఉమా సహాయం పరమేశ్వరం ప్రభుం
త్రిలోచనం నీలకంఠం ప్రశాంతం
ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూత యోనిం
సమస్త సాక్షిం తమసః పరస్తాత్ ॥

(కైవల్యోపనిషత్ 7శ్లో॥)

నిర్గుణ తత్త్వాన్ని అందుకోవాలంటే ముందుగా సగుణారాధన చేయవలసినదే. విక్షేప పూరితమైన మనస్సుని క్రమబద్ధం చేయాలంటే ఒక రూపం మీద దాన్ని లగ్నం చేయాలి. అయితే మనస్సులోని భక్తిభావం పరిపూర్ణం కానందువలన సగుణారాధనలో ముందుగా మనస్సు స్థిరపడదు సరికకదా తన ఎదురుగా ధ్యానించటానికి ఏర్పరుచుకున్న ఉమా సహిత పరమేశ్వరునిపై లగ్నం కాదు. అయితే సాధకుని బుద్ధి మనస్సులో లయమైతే వివేకవంతమైన విచారణ ద్వారా మనస్సు స్థిర పడుతుంది.

సాధన అనేది కేవలం క్రియ మాత్రమే. అది ఆత్మను అభివ్యక్తపరచే ఉపకరణ మాత్రమే. జగత్తులో సామాగ్రి అంతా కలిసి ప్రకృతిగా వ్యవహరిస్తుంది. ఆ ప్రకృతిని చైతన్యవంతం చేసే తత్త్వమే పురుషుడు. ప్రకృతి పురుషుల కలయికయే అభివ్యక్త రూపము.

మురళిగానం చేసే వ్యక్తి, మురళి అనే పరికరం లేకపోతే తన గానాన్ని వ్యక్తపరచలేడుకదా. అలాగే పరమేశ్వరుడు తాను వ్యక్త మవ్వాలంటే ఉమ అనే ఉపకరణం కావాలి. పరమేశ్వరుడే సాధకు లందరిలోను అధిష్ఠానమై, మనోబుద్ధులకు ఆధారమై, జడమైన ఉపకరణములన్నింటిని సచేతనం చేయటం జరుగుతోందన్న విషయం గ్రహించాలి. మనలో ధ్యానశక్తి పెంపొందాలన్నా, అనుభవాలు ఆలోచనలు కలగాలన్నా ఆ ప్రభువు సాన్నిధ్యమే అని గుర్తించాలి.

పరమేశ్వరుడు త్రినేత్రుడు అంటే ఆ మూడవది జ్ఞాన నేత్రం. సాధకుడు ధ్యానముద్రలో దేహమనోబుద్ధులను అధిగమించినప్పుడు మాంస చక్షువులతో వీక్షించే నామరూపాత్మకమైన పరిమిత ప్రపంచ

దృష్టి వదలి అద్వితీయమైన ఆత్మ దర్శనాన్ని పొందుతాడు. అలా వీక్షించే నేత్రమే జ్ఞాననేత్రంగా భావనచేయాలి.

దేహంపై అభిమానం ఉన్నంతవరకూ విక్షేపాలు, సంక్షోభాలు తప్పవు. దేహాభిమానాన్ని అధిగమించిన మరుక్షణం ప్రశాంతతే. ఆ తరువాత ఆత్మానందం నీ స్వంతం. జీవుడిగా ప్రకాశించే ఈశ్వరుడు. కేవలం సాక్షి. ఆకాశంలో ప్రకాశించే సూర్యకాంతి ద్వారా జగత్తులో ప్రతి ఒక్కరూ తమతమ కార్యాలను నిర్వహిస్తుంటారు. అయితే ఆ సూర్యకాంతి లోపిస్తే అన్ని పనులూ ఆగిపోతాయి. కాని వ్యక్తులు చేసే పనులకు గాని, వ్యక్తుల స్వభావాలకు గాని సూర్యుడు బాధ్యుడు కాదుకదా!

అలాగే పరమాత్మ జీవులందరిలో ప్రత్యగాత్మగా ఉండి సమస్త జగత్తుకు ఆధారమై సాక్షిగా మాత్రమే ఉంది. స్వప్నావస్థ నుండి బయట పడిన వ్యక్తి తన యదార్థ స్థితిని గూర్చిన సందేహం ఎలా తొలగిపోతుందో అలాగే ఆత్మ సందర్శనం పొందిన వానికి సంశయాలు, సందేహాలు వుండవు. అతడే పరిపూర్ణుడు.

### *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మార్చి 2017, ఏప్రియల్ 2017 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

మార్చి 2017: AS 4225, 5116, 5302, 6529, 6530, 6534, 7064, 7067, 7070
AS 7075, 7077, 7079, 7080, 7081, 7091, 7092, 7093, 7095
AS 7238, 7239, 7241, 7242, 7243, 7246, 7247.

ఏప్రయల్ 2017: AS 4102, 5133, 6826, 7109, 7111, 7117, 7118, 7255,
AS 7257, 7258, 7259, 7260, 7261, 7262, 7263.

– మేనేజర్

# శ్రీ బాబూజీ ఉపదేశ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ తన సందర్శనార్థం వేచియున్న భక్తులకు దర్శనభాగ్యాన్ని ప్రసాదించి భక్తులంతా లేచి నిలబడడం చూసి “మీ మనస్సు నిలబడాలి గాని ఈ దేహం నిలబడితే ఏమి ప్రయోజనం?” అన్నారు. ఇంతలో ఒక భక్తుడు వెధవ మనస్సు నిలబడడంలేదండీ అన్న సమాధానానికి బదులుగా బోధచేస్తూ.....



“మనసు అనేది మాయ. అది ఆత్మయొక్క ఛాయ. మాయ అంటే ఏదిలేదో అదే మాయ. ఆత్మవస్తువు ఎలా సర్వవ్యాపకమై ఉన్నదో మాయ కూడా అంతే. మనస్సు ఎన్నడూ చెడ్డది కాదు. అయితే మనస్సుకు స్వయం సత్తాలేదు. అది ఆత్మశక్తి చేతనే ప్రకాశిస్తుంది.

అమృతబిందూపనిషత్తులో **‘మనోహిద్వివిధం ప్రోక్తం శుద్ధంచాశుద్ధమేవచ, అశుద్ధం కామసంకల్పం శుద్ధం కామవివర్జితం’** అని చెప్పబడింది కదా! వేపరసంతో కూడి ఉన్న శనగగింజ చేదుగా వుంటుంది. పంచదార పానకంలో నానవేసిన శనగగింజ మధురంగా వుంటుంది. అలాగే విషయాదులతో కూడిన మనస్స అశుద్ధమనస్సగా, అంతర్ముఖమైన మనస్సు శుద్ధ మనస్సుగా వ్యవహరింపబడుతున్నాయి. నీవు భుజించేటప్పుడు పంటికింద రాయి పండిందనుకో ఎలా వుంటుంది? బాధగా ఉంటుంది కదా! వెంటనే భార్యమీద అరుస్తావు? ‘బియ్యంలో రాళ్ళు ఏరలేవా? అంత బద్ధకమైతే ఎలా?’ అని.

అలాగే నీవు నిదురించేటప్పుడు నీ దోమతెరలో ఒక దోమ వుందనుకో. అది బయటకు వెళ్ళదు లోపలనే ఉండి నిన్ను బాధిస్తుంది. ఆ దోమని ఎలాగైనా వదిలించుకుంటావా లేదా? మరి నీ మనస్సుని బాధించే గుణాల్ని ఎందుకు వదలలేకపోతున్నావు? నువ్వు పొందే మానసిక వేదన దేని వలన వచ్చిందో తెలుసుకోలేక అది ఎక్కడో బయటనుండి వచ్చిందని భావిస్తున్నావు. నీలోని గుణాలే నిన్ను బలహీనుణ్ణి చేసి బాధిస్తున్నాయి. దానిని తెలియజేసేవారే సద్గురుమూర్తి.

ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. మట్టిపని చేసుకునే కార్మికుని వస్త్రాలు మురికిగా ఉంటాయి. అదే ఒక ఆఫీస్‌కు పరిమితమైన ఉద్యోగి వస్త్రాలు పరిశుభ్రంగా ఉంటాయి. ఇక్కడ దోషం వస్త్రాలది కాదు. పరిసరాల ప్రభావం వల్ల మార్పు కలిగింది. అలాగే మనస్సు కూడా బాహ్య ప్రపంచంలో ఇంద్రియాలతో కూడా వ్యవహరించినపుడు మలిన భావాలతోను, ఆత్మతో కూడియున్నప్పడు శుద్ధమనస్సుగాను వ్యవహరింపబడుతోంది. గాఢ సుషుప్తిలో అజ్ఞాన స్థితిలో ఉన్నప్పటికీ మనస్సు ఇంద్రియాలతో కూడిఉండదు. కాబట్టి తాత్కాలికమైన శాంతి, ఆనందము లభిస్తాయి.

సాధకునికి మనస్సు నిలబడాలంటే గురుమూర్తి ముఖస్థుగా ప్రసాదించిన లక్ష్యార్థముపైన మనస్సును లగ్నం చెయ్యాలి. ఎంత సాధన చేసినా, ఎంత వయస్సు వచ్చినా సంకల్పాలు కలుగుతూనే ఉంటాయి. కోరికలకు అంతులేదు. దానికి కారణం దేహానికి వయస్సు ఉందికానీ మనస్సుకు వయస్సు లేదుకదా! కాబట్టి మనస్సును నిగ్రహించగల్గాలి. దేహానికి పుష్టినిచ్చేది ఆహారం. కానీ మనస్సుకి ఆహారం సద్గురుబోధ.

గురుదేవుని వద్ద ఎన్నడూ మనస్సును దాయరాదు. ఎంత చిన్న విషయమైనాసరే దానిని గురుదేవునకు నివేదించవలసినదే. వట బీజము అంకురించి పెద్దవటవృక్షమై ఎన్నో శాఖలు ఉత్పన్నంచేస్తుంది. మనస్సు కూడాఅంతే. మీలో ఎవరైనా మనస్సు దాచినప్పడు నేను మిమ్మల్ని హెచ్చరిస్తాను, మిమ్మల్ని సంస్కరిద్దామనే ఉద్దేశ్యంతో మీరు బాధపడతారని తెల్సినా హెచ్చరించక తప్పదుకదా! మీరు మనస్సు దాచి ప్రవర్తించడం వలన దాని ఫలితం ఎలా ఉంటుందో మీకు తెలియదు కానీ సద్గురుమూర్తికి అన్నీ తెలుసు.

ఆయనకు తెలుసు అని మీకు తెలియకపోయినా ఆయనకు తెలుసు. ఆయనకు తెలుసు అని మీకు విశ్వాసం ఉంటే అది మిమ్మల్ని రక్షిస్తుంది. తెలిసిన బాధనాది, తెలియని బాధమీది. ఏం చేస్తాం? మహాత్ములకు మనస్సుంటుందా అని మీరు భావించవచ్చు. ఉంటుంది. కానీ వారి మనస్సులో వికారభావాలు సంకల్పవికల్పాలకు, ఈర్ష్య, అసూయ, రాగద్వేషాలకు మనస్సులో స్థానం ఉంటుందా? ఉండదు. కాబట్టి మనస్సు వారి ఆధీనంలో ఉంటుంది. పూర్వకాలం సద్గురు మూర్తి

ఒక శిష్యుణ్ణి స్వీకరించేముందు పన్నెండు సంవత్సరములు పరీక్షించేవారు. శిష్యుని ప్రవర్తనని పరిశీలించి అన్నీ క్షాళన అయిన తరువాత ఆశ్రమంలోనికి రానిచ్చేవారు. కఠోర నియమాలు ఉండేవి. శిష్యుని క్షేత్రశుద్ధి అయిన తరువాత సద్గురుమూర్తి ఉపదేశం చేసేవారు. ఇప్పుడు అటువంటి గురువులు ఉన్నారా? సందేహమే. ఇప్పటివారంతా చేతిలో రూపాయి చెవిలో మంత్రంవారే కదా!

మీకొక విషయం చెబుతాను. శ్రీ రామచంద్రుడు నీలమేఘ శ్యాముడు, అతిసుందరమైనవాడు. ఆయన చూపుతోనే ఆనందాన్ని అందించేవాడు. ఆయన నుండి వచ్చే దివ్యసుగంధం మానవ కోటిలో ఉన్న మాలిన్యాన్ని, దుర్గంధాన్ని హరించేవి. ఆయన నుండి వచ్చే సుగంధాన్ని తమపై ప్రసరింపచేయమని వృక్షాలు, జంతువులు వాయుదేవుణ్ణి ప్రార్థించేవి. లతలు ఆ సుందరమూర్తిని ఎప్పుడు పెనవేసుకుని ఆయన దివ్యస్పర్శను పొందుదామా! అని ఆకాంక్షించేవి. రాతిని నాతిగా మార్చిన ఆయన స్పర్శకోసం రాళ్ళు తహతహలాడేవి. మరి అటువంటి మహాత్ములు అవతరించినపుడు మానవుడు ఆ సదవకాశాన్ని పొందటానికి ఎంతవరకు ఆవేదన, తపన చెందుతున్నాడు? అలా సద్వినియోగం చేసుకుంటే నాకు ఈ తిప్పలు ఎందుకు? నేను మిమ్మల్ని హెచ్చరించడమెందుకు? పోనీ హెచ్చరించినా సరిదిద్దుకునేవారు ఎంతమంది? వారి కోసమేగా నేను పడే ఈ బాధ. దీనిని గ్రహించండి చాలు."

"మనస్సు ఆత్మలో లయిస్తే సంకల్పాలకూ, కోర్కెలకూ తావేలేదు. యథార్థమే. కానీ మనస్సు ఇంద్రియాలతో కూడియున్నపుడు ఇంద్రియ లక్షణాన్ని బట్టి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను అందజేస్తుంది. కరెంటు బల్బుకి అందిస్తే కాంతి లభిస్తుంది. ఫ్యానుకి అందజేస్తే గాలిని అందిస్తుంది. కాబట్టి ఈ దేహముద్వారా పొందే ఏ చలనానికైనా కారణము ఇంద్రియాలే కానీ మనస్సులో ఏ దోషములేదు. కాబట్టి శాంతిని వాంఛిస్తే మనస్సుని అంతర్ముఖం చేయాలి. అలాకాని పక్షంలో నీకు అశాంతి ప్రాప్తించవచ్చు. అందువలన సాధకుడు మనస్సును అంతర్ముఖంచేసి సాధన కొనసాగిస్తే అది క్రమేపీ తపస్సుగా మారి నిర్వికల్పసమాధి స్థితికి తీసుకువెడుతుంది" అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## అందరిలో గుడి ఉంది

**దేహో దేవాలయ ప్రోక్తః। జీవో దేవ స్సనాతనః -**

అనే ఉపనిషత్ వాక్యానుసారం, మనందరి దేహము ఒక్కొక్క దేవాలయ మయితే, మనందరి దేవాలయాలలోనూ సనాతనుడైన సదాశివుడు కొలువై వున్నాడు. ఈ దేహమనే దేవాలయంలో దేవుడిని ఎప్పుడు ఎవరు ప్రతిష్ఠించారు? మనం తల్లి కడుపులో వుండగానే, ఆ భగవంతుడు తనంతట తానే మనలో ప్రతిష్ఠితమవుతున్నాడు. కనుక మన హృదయం దేవాలయంలోని దేవుడు స్వయంభూగా తనను తానే ప్రతిష్ఠింప జేసుకుంటున్నాడు. ఇది దైవ సృష్టి. మనం రోజూ చేసుకునే కార్యక్రమాలు, బయట ఆలయాలలో మనం చేసే విగ్రహ ప్రతిష్ఠలు - ఇవన్నీ మానవ సృష్టి.



భగవంతుడు చేసిన సృష్టిలో ఒక ఆలయం ఉన్నట్లు మరొక ఆలయం ఉండదు. కానీ, లోపల ప్రతిష్ఠ అయిన భగవంతుడిలో మాత్రం మార్పు లేదు. ఉపాధులలో భేదం ఉంది; కాని వాటిని ప్రకాశింపజేసే చైతన్యం లేక శక్తికి మాత్రం మార్పు లేదు. బల్బులు, ఫ్యానులు, మైకులు యిత్యాది ఉపాధులెన్నైనా వాటిని పని చేయించే కరెంటులో మార్పు లేదు కదా!

మన లోపలే దేవుడిని పెట్టుకుని మనం ఆ దేవుడెక్కడో వున్నాడని బయట వెదుకుతున్నాం. ఆయన కనబడటం లేదని అశాంతి పాలవుతున్నాం. అసలు మానవుడు తన జీవితానికి కావలసిన దాని కోసం ఏమైనా ఆలోచిస్తున్నాడా? ఎన్ని ఉన్నా ప్రతి మానవుడికీ కావలసినది సంతోషము, మనశ్శాంతి. మనకి శాంతిని ప్రసాదించే ఆ శాంతి ప్రదాత ఎవరు? అది ఒక అవ్యక్తమైన శక్తి. మనం రూప నామాలకి అలవాటు పడిపోయి వున్నాం. కాబట్టి ఆ శక్తి ఒక దివ్య రూపాన్ని దాల్చి ఒక అవతార స్వరూపంగానో, ఒక గురు రూపంలోనో మనముందుకు వస్తోంది.

జనన, మరణ దుఃఖ రూప భవరోగంతో మనం బాధ పడుతున్నాం. దీని నుండి మనకి విముక్తిని ప్రసాదించేవారు కేవలం భగవరోగ మహావైద్యుడైన సద్గురుదేవుడు మాత్రమే. మనకి శారీక రుగ్మత తగ్గాలంటే మనం ఆశ్రయించిన డాక్టరు యందు విశ్వాసం వుంచి, ఆయనిచ్చిన మందుని సరిగా సేవిస్తూ, వారు చెప్పినట్లుగా పథ్యం చేయాలి. అదే విధంగా భవరోగం నుండి విడివడాలంటే శ్రీగురుదేవులు చెప్పింది చెప్పినట్లుగా ఆచరించాలి. కామ, క్రోధాది గుణాలను, ఈర్ష్య, అసూయ, అసహనము, ఓర్వలేనితనం యిత్యాది గుణాలను పారద్రోలే పథ్యం చేస్తూ, శ్రీగురుదేవులు ప్రసాదించిన లక్షార్థ్యమనే మహామంత్రాన్ని మూడుపూటలా ధ్యానం చేయాలి. ఈ విధంగా ఆచరించిననాడు యిక పునరపి జననం పునరపి మరణమనే వలయం నుండి బయట పడటం తథ్యం.

ఇటువంటి సాధన చేయడానికి శ్రీగురుదేవులు మనకి ఆశ్రమమనే ఒక దివ్యమైన ప్రదేశాన్ని ప్రసాదించారు. ఆశ్రమంలో అడుగు పెట్టేసరికి ప్రశాంతత ఎందుకు వస్తోంది? ఇక్కడ భక్తుల యొక్క వుచ్ఛ్వాస నిశ్వాసలలోని ఆధ్యాత్మిక తరంగాలు వాతావరణం అంతా మిళిత మవడం వలన, యిక్కడ ఇంత చక్కటి ప్రశాంతత లభిస్తోంది. కానీ ఇంత ప్రశాంత వాతావరణంలో వున్నా, మనస్సు ప్రపంచం వైపే తిరిగి వుంటే, శాంతి లభించదు. అనేక నీటి బిందువులు కలిస్తే ఒక సెలయేరు; అనేక సెలయేరులు కలిస్తే ఒక నది; అనేక నదులు కలిసి ఒక సముద్రంలో ఏకమైనట్లు, సృష్టిలోని ప్రతి ఒక్క జీవరాశి కూడా ఆ పరమాత్మయందు లయమవవలసినదే.

జీవరాసులెన్నైనా, వాటిలోని పరమాత్మ ఒక్కడే. మనమంతా ఒకటే అనకున్నప్పుడు, ఆవేశాలకీ, ఈర్ష్యాసూయలకీ తావు వుండదు.

ఇన్ని గుళ్ళు (ఆలయాలు)కట్టి, యిన్నింటిలో తిరుగుతున్న ఆ పరమాత్మని గుర్తించండి.

# వాచ్యార్థము ~ లక్ష్యార్థము

- పరాశర ప్రసాద్

ఒక పదము యొక్క ప్రాథమిక సూటియైన అర్థం వాచ్యార్థం. ఆ పదము యొక్క అంతర్గర్భితమైన భావర్థామే లక్ష్యార్థం. పదానికి దాని అర్థానికి గల సంబంధమే వృత్తి.

వృత్తి రెండు రకాలు. శక్తి వృత్తి, లక్షణ వృత్తి. పదము యొక్క అర్థ జ్ఞానము శక్తి వృత్తి. దాని ద్వారా పదము యొక్క వాచ్యార్థాన్ని తెలుసుకొన వీలవుతుంది. పదము యొక్క అర్థాన్ని సూటిగా తెలియజేయని లక్షణాన్ని లక్షణవృత్తి అంటారు. లక్షణ వృత్తి ద్వారా పదము యొక్క అర్థము తెలుసుకోవటమే లక్ష్యార్థము.

ఒక పదము యొక్క వాచ్యార్థము ఆధారంగా దాని సరియైన అర్థజ్ఞానం కలిగించే వృత్తి లక్షణ వృత్తి. ప్రతి పదానికి ఉండే స్వాభావికత వలన దాని అర్థం గ్రహించగల్గుతాం. కుండ అని ఉచ్చరించగానే, దాని ఆకారం మదిలో మెదులుతుంది. కాని అదే పదాన్ని వేర్వేరు సందర్భాలలో ఉపయోగించటం జరుగుతుంది. అయితే ఆ సందర్భాన్ని బట్టి దాని వాస్తవిక అర్థం వాచ్యార్థంగా భావించబడుతుంది.

తత్త్వమసి అన్న మహావాక్యంలో తత్ మరియు త్వం అన్న పదాలు ఎన్నో విషయాలను తెలియజేస్తాయి. కాని యదార్థంగా తత్ అన్న పదానికి వాచ్యార్థం భగవంతుడు అని. త్వం అన్న పదానికి జీవుడు అని అర్థం చేసుకోవాలి. పదం యొక్క వాచ్యార్థం తెలియకపోతే ఆ పదం యొక్క వాస్తవికత అంటే లక్ష్యార్థం తెలియదు.

ఒక పదం యొక్క ప్రత్యేక లక్షణం లక్షణవృత్తి. ఇది మూడు రకాలు. 1. జహత్ లక్షణం. 2. అజహత్ లక్షణం. 3. భాగత్యాగ లక్షణం.

1. జహత్ లక్షణము - దీనిలో వాచ్యార్థాన్ని పూర్తిగా వదిలి, అర్థం వచ్చే విధంగా ఆ పదాన్ని మార్పు చేయవలసి ఉంటుంది. ఉదాహరణకి 'గంగలో గ్రామం ఉంది' అన్న వాక్యం తీసుకుంటే ఆ వాక్యానికి అర్థం లేదు. కాబట్టి 'గంగా తీరంలో' అని సవరిస్తే సంపూర్ణ అర్థం వస్తుంది.

2. అజహత్ లక్షణం - దీనిలో వాక్యం యొక్క వాచ్యార్థం పూర్తిగా వుంచి, దానికి కొన్ని క్రొత్త పదాలు చేర్చటం జరుగుతుంది. ఉదాహరణకు గుర్రం పందాలకు వెళ్ళిన స్నేహితులలో ఒకడు తన ప్రక్కనున్న వాడిని 'నీవు ఏ గుర్రంపై పందెం వేశావు?' అని అడిగితే, వాడు 'తెలుపు రంగుది

పరుగెడుతోంది అది నాది’ అంటాడు. ఇక్కడ తెలుపు రంగు అన్న పదానికి గుర్రం అనే పదం చేరిస్తే “తెలుపు రంగు గుర్రం పరుగెడుతోంది అది నాది” అనే సంపూర్ణ అర్థం వస్తుంది.

3. భాగత్యాగ లక్షణం - దీనిలో జహత్, అజహత్ అనే రెండింటి సమ్మేళనం కాబట్టి వాచ్యార్థంలో కొంత భాగం వదలి, కొంత భాగం తీసుకుంటే వాచ్యార్థానికి పూర్ణ అర్థం ఆపాదించినట్లు అవుతుంది.

సోయం దేవదత్తః అన్న వాక్యం దీనిని విశదీకరిస్తోంది. వారణాసిలో రాజకుమారుని దుస్తులలో కనిపించిన దేవదత్తుడనే వ్యక్తి ఋషీకేశ్‌లో సన్యాసి రూపంలో కనిపించినప్పుడు ‘ఇతడు ఆ దేవదత్తుడే’ అనటం జరుగుతుంది.

‘ఆ’ అన్న పదానికి వాచ్యార్థం పదిసంవత్సరాల క్రితం వారణాసిలో రాజకుమారుని దుస్తులలో కనబడిన వ్యక్తి ‘ఇతడు’ అన్న పదానికి ప్రస్తుతం ఋషీకేశ్‌లో సన్యాసి రూపంలో ఉన్న అదే వ్యక్తి. ఆ అన్న పదం వాచ్యార్థం నుండి స్థలము, దుస్తులు తీసివేసి, వ్యక్తిని మాత్రమే పరిగణలోకి తీసుకుని ఇతడు అన్న పదం వాచ్యార్థానికి విరుద్ధమైన రూపురేఖలు తీసివేసి, వ్యక్తిని మాత్రమే గుర్తిస్తే మిగిలేది దేవదత్తుడు మాత్రమే.

వాచ్యార్థంలో కొంత భాగం ఉంచి, కొంత భాగం తీసివేయటం వలన మిగిలేది భాగత్యాగ లక్షణంగా గుర్తించాలి. తత్త్వమసి అన్న మహా వాక్యాన్ని ఈ విధంగానే అర్థం చేసుకోవాలి. తత్, త్వం శబ్దాల వాచ్యార్థాల నుండి వైరుధ్యంగల మాయ, అవిద్యలను తొలగించి వైరుధ్యం లేని శుద్ధ చైతన్యాన్ని ఉంచినట్లయితే దాని వాచ్యార్థం గోచరమవుతుంది.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, శ్రీమతి పెనుమాక సుబ్బమ్మ గారు 30-1-2017 సోమవారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 91 సంవసత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# కృష్ణం వందే జగద్గురుమ్

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

శ్రీకృష్ణుడు అవతరిస్తూనే ............ తల్లిదండ్రుల భవ బంధాలను త్రుంచివేశాడు.

తనను ప్రేమించిన గోపీగోపాలురలకు, తనను ద్వేషించిన రాక్షసులకు కూడా ముక్తిని ప్రసాదించాడు. గోపికల అజ్ఞాన వస్త్రాలను అపహరించి, వారికి జ్ఞాన వస్త్రాలను ప్రసాదించాడు. జీవాత్మకు పరమాత్మకు మధ్య అనునిత్యం జరుగుతూ ఉండే అద్భుత క్రీడను రాసలీల రూపంలో మనకు వివరించాడు.



ప్రేమకు అందంతో సంబంధం లేదని కుబ్జ ద్వారా నిరూపించాడు. స్నేహానికి అంతస్తులతో పనిలేదని కుచేలుని ద్వారా నిరూపించాడు.

తనను ఆశ్రయించిన పాండవులను అడుగడుగునా రక్షించాడు. తనను వ్యతిరేకించిన కౌరవులను కూడా మంచి మార్గంలో పెట్టడానికి చివరిదాకా ప్రయత్నించాడు.

'అన్నా!' అని అర్థించిన ద్రౌపది మానాన్ని అక్షయ వలువలు ఇచ్చి కాపాడాడు.

రణరంగంలో కర్తవ్యతా విమూఢుడై, దిశా నిర్దేశానికి అర్థించిన అర్జునుని నెపంగా పెట్టుకుని సమస్త మానవాళికి తరతరాలకు ఆచరణీయమైన భగవద్గీతను అందించాడు.

అట్టి జగద్గురు గీతాచార్యునికి శతసహస్ర వందనాలు!!!

# కఠోపనిషత్

- రమణ ప్రసాద్

## కథాభాగం

వాజస్రవుడు యాగం చేసి తనవద్ద ఉన్న సమస్త వస్తువులను దానంగా ఇచ్చివేశాడు. అతడికి నచికేతుడనే కుమారుడు ఉన్నాడు. నీరు త్రాగటానికి, గడ్డిమేయటానికి, పాలు ఇవ్వటానికి శక్తి లేని ఆవులను దానం చేస్తే ఆనంద రహితమైన లోకాలను పొందుతాడు అని భావించి నచికేతుడు, “ తండ్రీ! నన్ను ఎవరికి దానం ఇవ్వబోతున్నారు? అని అడిగాడు. ఆయన సమాధానం చెప్పకపోయే సరికి రెండవసారి, మూడవసారి అడిగాడు. తండ్రి కోపంతో “నిన్ను యముడికి ఇస్తాను” అన్నాడు.

నచికేతుడు యమలోకానికి వెళ్ళేసరికి యముడు అక్కడ లేడు. మూడు రోజులు నిరాహారిగా ఉండటం తటస్థిస్తుంది.. యముడు తన సత్కర్మల ఫలం పోతుందని భయపడి, “ ఓ అతిథీ! నమస్కరింపతగ్గ నువ్వు నిరాహారిగా మూడు రాత్రులు గడిపావు. ఆ దోషం నాకు రాకుండా నానుంచి మూడు వరాలు స్వీకరించు.” అన్నాడు.

నచికేతుడు, “యమధర్మరాజా! నీ నుంచివెళ్లిన తరువాత నా తండ్రి కోపరహితుడై నన్ను ఆదరించాలి. మొదటివరంగా దానిని అనుగ్రహించు. యముడు ఆ వరాన్ని ప్రసాదించాడు. స్వర్గంలో జీవించేవారు అమరత్వాన్ని పొందుతారు. అక్కడికి తీసుకుపోగల యాగాన్ని నాకు తెలియజెయ్యి. ఇది నేను కోరే రెండవ వరం. యమధర్మరాజు ఆ యాగం గురించిన వివరాలు చెప్పగా ఏకసంతాగ్రాహి అయిన నచికేతుడు అర్థం చేసికోవటం చూసి, “ఇకపై ఈ యాగం ‘నచికేతయాగం’ అనే పేరిట ప్రసిద్ధమవుతుంది” అని చెప్పాడు.

నచికేతుడు - మరణానంతరం మనిషి జీవిస్తున్నాడని కొందరు, లేదు అని కొందరు అంటున్నారు. మూడవ వరంగా నాకు కలిగిన ఈ సందేహాన్ని నివృత్తి చేయండి.

యమధర్మరాజు - ఈ విషయంలో దేవతలకుకూడా సందేహం ఉంది. ఇది సూక్ష్మమైన విషయం. కనుక వేరే ఏదైనా వరం కోరుకో. నన్ను

బలవంతపెట్టకు.
నచికేతుడు - అయితే దానిని ఉపదేశించటానికి నీ వంటివారు నాకు లభించరు. ఇది తప్ప నాకు ఏ వరమూ వద్దు.
యమధర్మరాజు - నూరేళ్ళు ఆయుష్షు గల కొడుకులను కోరుకో. పశువులను, గుఱ్ఱాలను కోరుకో. విశాలమైన సామ్రాజ్యాన్ని కోరుకో. నీకు ఇష్టమైనంత కాలము జీవించు.
నచికేతుడు - నీవు చెబుతున్న సుఖాలన్నీ అశాశ్వతాలు. జీవితమే స్వల్పమైనది. కనుక నాకు ఆయుష్షు, ఏ ఇతర సంపదా వద్దు.

**తత్త్వభాగం**

యమధర్మరాజు -శ్రేయస్సు వేరు. ప్రేయస్సు(సుఖకరమైనది) వేరు. ఇవి మనిషిని బంధిస్తాయి. బుద్ధిమంతుడైనవాడు ఈ రెంటిని బాగా వివేచన చేస్తాడు. సుఖకరమైనవాటిని వదలి శ్రేయస్కరమైన దానిని ఎన్నుకొంటాడు.

భగవన్నామం, ప్రాపంచికత పరస్పర విరుద్ధమైనవి. నువ్వు అన్ని కోరికలను వదలి భగవన్మార్గంలో ఆసక్తి చూపుతున్నావు. ప్రాపంచికతలో నివసించే మూర్ఖులు తాము బుద్ధిశాలురమని భావిస్తారు. మళ్ళీ మళ్ళీ జనన మరణ వలయంలో పరిభ్రమిస్తూ ఉంటారు. మనోపక్వత లేనివారికి పరలోక నిజాలు అర్థం కావు. " ఈ లోకమే సమస్తం. వేరే ఏదీ లేదు" అని భావించి పతనమవుతారు. నచికేతా! ఈ జ్ఞానం తర్కం వల్ల లభించేది కాదు. కర్మ ఫలాలు అశాశ్వతమైనవి. వాటివల్ల ఆత్మను పొందలేము.

స్వర్గలోకం కోర్కెలుతీర్చుకొనే చోటు. స్వర్గం యజ్ఞ యాగాల ఫలితంగా లభించే సుఖాలకు ఆలవాలం. నువ్వు అడిగిన ఆత్మ ఎంతో శ్రమతో పొందదగినది. హృదయగుహలో ప్రకాశించేది. సనాతనమైనది. బుద్ధి వికాశం పొందిన ధీశాలి జ్యోతిర్మయమైన ఈ ఆత్మను "ఆధ్యాత్మయోగం"ద్వారా ధ్యానించి సుఖదుఃఖాలకు అతీతుడవుతాడు. ఈ సత్యాన్ని గురువు ద్వారా తెలుసుకోవాలి. విచారణ చేసి శరీరాన్నుంచి ఆత్మను విడదీయాలి.

- సశేషం

# త్రిపురా రహస్యం

## జ్ఞాన ఖండం

- రమణ ప్రసాద్

ఓం నమః కారణానందరూపిణీ పర చిన్మయీ ।
విరాజతే జగచ్చిత్ర చిత్ర దర్పణ రూపిణీ ॥

'ఓంకార నిర్దేశ్యము, సర్వ జగత్కారణము, బ్రహ్మానంద రూపము,జగత్తు అనెడి చిత్రములకు ప్రతిబింబమైన, విచిత్రమైన దర్పణము అయిన త్రిపురాదేవి సర్వోత్కృష్టంగా ప్రకాశిస్తోంది.'

ఓమితి బ్రహ్మ - బ్రహ్మను ఓంకారరూపంగా ఉపాసించాలి. ఆ బ్రహ్మము జగత్తుయొక్క సృష్టి స్థితి లయములకు కారణము. - ఆమెయే త్రిపురాదేవి, జగత్తుకు అధిష్టానము. ఆమె కంటె ఇతరము లేదు. ఈ దేవి గురించి దత్త గురువు వివరించాడు. పరశురాముడు భక్తి పారవశ్యంతో విన్నాడు. త్రిపురోపాసన దీక్షను పొందాడు. కర్తవ్యతాశేషం అంటే దానివల్ల కలిగే సుఖము సుఖము కాదు. కాలిపోయిన పాదాలకు గంధం పూయటం, క్షయరోగికి సంగీతం వినిపించటం, గుండెలో బాణం గ్రుచ్చు కున్నప్పుడు అప్సరసస్త్రీ ఆలింగనము వంటివి నిజమైన సుఖాన్ని కలిగించలేవు.



పరశురాముడు దత్తగురువుతో ఇలా అన్నాడు. " నేను రాముని చేతిలో పరాజయం పొంది ఎంతో దుఃఖాన్ని పొందాను. నేను తిరిగి వస్తూ దారిలో అవధూతయైన సంవర్తకుని(బృహస్పతికి సోదరుడు) కలిశాను. ఆయన నాకు తత్త్వాన్ని బోధించి తమ వద్దకు పంపారు."

దత్త గురువు - కర్మలు దుఃఖ కరములు. అయినా త్రిపురోపాసన పరదేవతా సంబంధమైనది కనుక ఈ ఉపాసన కూడా కర్మ అయినా దుఃఖం కలుగదు. క్రతువులు అసత్యములు. కనుక వాటి

ఫలములుకూడా అసత్యములే. లోక వ్యవహారంలో ఈ కర్తృత్వతే దుఃఖానికి కారణమవుతోంది. సుషుప్తిలో కర్తృత్వత ఉండదు కనుక దుఃఖం ఉండదు. సుఖం కనపడుతుంది.

పరశురాముడు - ఈ కర్తృత్వత నుండి నన్ను విడిపించండి.

దత్త గురువు - అందరి హృదయాలలో ఉన్న త్రిపురాదేవిని శరణు కోరితే అతనికి చిత్త నివృత్తి కలిగి మోక్ష పదవికి తీసికొని పోతుంది. నీకు బాగా విశదం కావటానికి బాట సారుల కథ చెబుతాను:

కొందరు బాట సారులు వింధ్యపైన విషముష్టి పళ్ళని తుమ్మి పళ్ళుగా భావించి తిన్నారు. వారి కళ్ళు చీకట్లు కమ్మాయి. ఎంతో బాధను అనుభవించారు. ఆ బాధ పోగొట్టుకోవటానికి నిమ్మపళ్ళు అని భావించి ఉమ్మెత్త పళ్ళు తిన్నారు. లోపల ఉద్భవించిన ఉష్ణ జ్వాలలకు వారి కళ్ళు పోయాయి. వారు నడుస్తూవెళ్ళి అగడ్తలో పడ్డారు. ద్వారపాలకులు వారిని బయటకు తీసి రక్షించారు. ఆ విధంగానే లోకులు హితం అనే భ్రమతో కర్తృత్వం అనే విషానికి లోనై మోహంలో పడి గ్రుడ్డివారైపోతున్నారు.

శ్రేయోమార్గం అవలంబించాలంటే విచారణ (విమర్శ, వివేకము) ముఖ్యం. సుఖం అనే వృక్షానికి విచారణ అనేది మొలకెత్తే శక్తి బీజం లాంటిది. విచారణశీలురుగా ఉండేవారే మహాత్ములు. త్రిపురాదేవి వారి చిత్తాకాశంలో సద్విచారణ కలిగిస్తుంది. విచారణ వల్ల శ్రేయస్సు కలుగుతుంది.

సత్పురుషుల సాంగత్యం వల్లకూడా శ్రేయస్సు కలుగుతుంది. అది సర్వ దుఃఖాలను పోగొడుతుంది.

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి దివ్వెల శ్రీలక్ష్మి (వక్కపాడి లక్ష్మి)గారు 7-2-2017 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 80 సంవత్సరాలు. శ్రీసద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# సమర్థ సద్గురు

[యాజమాన్యం తదితర వివరాలు]

FORM - 4 ( 8వ నిబంధన ప్రకారము)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | - శ్రీ కాశీ గార్డెన్స్, నంబూరు R.S |
| ఎంత కాలానికి ఒకసారి | - మాస పత్రిక |
| ముద్రాపకుని పేరు | - సి.వి. రమణబాబు |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| సంపాదకుని పేరు | - డి.జె.బి.కె. లాల్. |
| జాతి | - భారతీయుడు |
| విలాసము | - D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |
| పత్రిక యజమానులు | - యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ ఛారిటబుల్ ట్రస్ట్ D.NO. 3-499 శ్రీకాళీగార్డెన్స్, నంబూరు R.S గుంటూరు జిల్లా , ఆంధ్ర ప్రదేశ్ |

పై విషయములు నాకు తెలిసినంత వరకు వాస్తవములని తెలియచేస్తున్నాము.

శ్రీ కాళీ గార్డెన్స్ ( సం) సి.వి. రమణబాబు

ది. 1-3-2017

పబ్లిషర్

# భయంకర విష సర్పము

(పరమార్థ కథలు)

అదొక వీధి బడి, పంతులుగారు చిన్నచిన్న పిల్లలకు వ్రాత నేర్పుతున్నారు. పిల్లలు పలకా, బలపం తీసుకుని మాస్టరుగారు చెప్పినది శ్రద్ధగా వ్రాస్తున్నారు.

పంతులుగారు - ఒరేయ్ పిల్లలారా! పుణ్యము అని వ్రాయండి.

పిల్లలు - వ్రాశాము.

పంతులుగారు - పాపము అని వ్రాయండి.

పిల్లలు - సార్! వ్రాశాము.

పంతులుగారు - సరే ఇక చాలు. మీ పలక తీసుకురండి చూస్తా!

పిల్లలు అందరూ వారి వారి పలకలను మాస్టారుగారికి చూపించారు. వారందరూ చక్కగా వ్రాశారు. మా పిల్లలు బాగా నేర్చుకున్నారని మాస్టారుగారు పరమానంద భరితులయ్యారు. కానీ ఒక పిల్లవాని పలక చూడగా ఒక చిన్న తప్పు కనిపించింది. వాడు 'పాపము' అని వ్రాయటకు బదులుగా 'పాము' అని వ్రాశాడు.

పంతులుగారు వాడిని మందలిస్తూ "ఏమిరా! పాపము అని వ్రాయమంటే పాము అని వ్రాశావు?

పిల్లవాడు - సార్! రెండూ ఒకటేనండీ. పామూ ఈజ్ ఈక్వల్టు పాము.

పంతులుగారు - అరే! పాపము పాము ఎలా అవుతుందిరా?

పిల్లవాడు - రెండూ మనిషిని బాధిస్తాయి. నిజం చెప్పాలంటే పామే కొంత వేలు. అది ఒక శరీరాన్నే చంపుతుంది. కానీ, పాపము జన్మజన్మాంతరాలలో కూడా జీవుణ్ణి బాధిస్తూ అనేక శరీరాలను చంపుతుంది.

పంతులుగారు - భేష్! ఎంత చక్కగా చెప్పావురా! సరేగానీ, ఇక మీదట చెప్పింది చెప్పినట్లు వ్రాయి.

జనులారా! పాపము విషసర్పము కంటె అధిక బాధను జీవుడికి కలుగ జేస్తుంది. దాన్ని తొలగించుకుని, పుణ్యమునే ఆర్జించుట శ్రేయస్కరము.

**నీతి - పాపము పాము కంటె భయంకరమైనది. కావున దానిని అవలంబింప రాదు.**

# బాటసారి భాగ్యము - గాలి జగదీశ్

చిత్రకూట పర్వత శిఖరంపై కూర్చుని, ప్రకృతి వైభవాన్ని, పర్వత సౌందర్యాన్ని, మందాకినీ నది మనోహర వేగాన్ని వర్ణిస్తూ, సీతాదేవితో శ్రీరామ చంద్ర ప్రభువు ....

"సీతా! ఫలపుష్ప భరితమైన ఆ పెద్ద వృక్షాన్ని చూడు, ఆ వృక్షాన్ని ఆ అందమైన లత ఏ విధంగా అల్లుకుపోయిందో! మనోహర మైన ఆ లతను పొందిన ఆ చెట్టు ఎంత అదృష్టం చేసుకుందో!" అన్నాడు.

దానికి సీతాదేవి సమాధానం చెబుతూ "నాధా! నా భావన మరో విధంగా ఉన్నది. ఫలపుష్ప భరితమైన అంతపెద్ద వృక్షాన్ని, ఆలంబనంగా చేసుకుని పైకి ప్రాకే భాగ్యాన్ని పొందిన ఆ లత ఎంత అదృష్టం చేసుకున్నదో!" అన్నది.

ఈలోగా, ఫల పుష్పాదులను తీసుకుని లక్ష్మణుడు వచ్చాడు. రాముడు వారిద్దరి మధ్య జరిగిన విషయాన్ని వివరించి, "లక్ష్మణా! నేను భావించినట్లు వృక్షానిది అదృష్టమా? లేక సీత చెప్పినట్లు లతది అదృష్టమా?" అని అడిగాడు.

అప్పుడు లక్ష్మణుడు తనదైన శైలిలో "ఏమో! నా భావన ఇంకో విధంగా ఉన్నది. మనోహరమైన ఆ లత మనోజ్ఞంగా అల్లుకుపోయిన ఆ మహావృక్షం క్రింద హాయిగా విశ్రమించిన ఆ బాటసారి భాగ్యమే మహా భాగ్యము!" అన్నాడు.

కోమల హృదయురాలైన లతవంటి సీతను పొందిన తాను భాగ్యశాలి అని రాముడు భావిస్తాడు. ధర్మవృక్షం వంటి రాముని అండ లభించినందుకు తను భాగ్యశాలి అని సీత భావిస్తుంది. సీతారాముల ఆశ్రయం లభించినందుకు బాటసారిలాగ తన జన్మ ధన్యమని లక్ష్మణుడు భావిస్తాడు.

బృందావనాధీశుడైన శ్రీశ్రీశ్రీ సమర్థసద్గురు హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి ఆరాధనలో ఉన్న పూజ్యశ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ సన్నిధిలో ఉన్న భాగ్యమే భాగ్యము! అని తలుస్తారు శ్రీబాబు భక్తులు.

# పుణ్యుడు - పావనుడు

సేకరణ - మురళీ

(వార్తాలాపము నుండి)

దీర్ఘతమ మునికి ఇద్దరు కుమారులు - పుణ్యుడు, పావనుడు. ఆ ముని దేహత్యాగం చేశాడు. అతని భార్యకూడ తన యోగశక్తిచే శరీరాన్ని విడిచిపెట్టి స్వామిని చేరుకున్నది.

రెండవ కుమారుడు పావనుడు తల్లిదండ్రుల వియోగాన్ని భరించలేక దుఃఖపడుతుండగా, అన్నగారైన పుణ్యుడు తన తమ్ముని ఓదారుస్తూ ... "పావనుడా! ఎందుకలా విచారిస్తున్నావు? మన తల్లిదండ్రులు ఆత్మపదాన్ని పొందారు. వారికి ఉత్తమోత్తమమైన పదవి లభించింది. నీవు శోకించవలసిన పని లేదు. శోకింపరానిదాన్ని గురించి నీవు ఎందుకిలా శోకిస్తావు? ఋతువుననుసరించి వృక్షానికి పండ్లు కాసి, పండిపోయి, రాలిపోయినట్లే మానవునికి జననమరణాదులు కలుగుతున్నాయి. నీవు ఈ జన్మలోని తల్లిదండ్రుల గురించి మాత్రమే ఏడుస్తున్నావు. కానీ, గడచిన జన్మలలో నీకు అనేకానేకమంది తల్లి దండ్రులు మరణించారు కదా! మరి వారి గురించి ఎందుకు శోకించటం లేదు? చాలాకాలమగుటచే వారి జ్ఞాపకము నీకు లేదు.

ఓ మహాభాగ్యుడా! దృశ్యమానమైన ఈ ప్రపంచము జాగృతమైన భ్రమ. పరమార్థిక దృష్టితో చూస్తే ఈ జగత్తు లేదు. మిత్రులు లేరు, శత్రువులు లేరు. ఎవరూ లేరు. కనిపించేదంతా భ్రమ. మాయా దృష్టిచే మాటిమాటికి ఉత్పన్నమవుతూ, నశిస్తూ ఉంటుందని నీకు కూడా తెలుసు. ప్రపంచం గురించి ఎట్టి కల్పన చేస్తావో అది అలాగే నీకు కనిపిస్తుంది. పత్నీ భావన కలిగినచోట పత్ని భాసిస్తుంది, పుత్ర భావం కలిగినచోట పుత్రుడే భాసిస్తాడు.

యోగదృష్టితో చూస్తే, నీవు, నేను కూడా అనేక పర్యాయాలు, అనేక యోనులలో జన్మించాము. వాసనలను అనుసరించి జన్మలు వస్తుంటాయి. దర్పణమందు ప్రతిబింబం పడినను, ఆ దర్పణానికి సంతోషంగానీ, దుఃఖంగానీ పొందదు. అలాగే జ్ఞానికి రాగద్వేషాలు కలుగవు. తన స్వస్వరూపమందు నిమగ్నుడై ఉంటాడు. అలాగే నీవు కూడా ఈ మిథ్యయగు దేహభావన త్యజించి, నిత్య శుద్ధ శాంత పరమానంద స్థితిని పొందు. నీవే ఆ పరబ్రహ్మస్వరూపుడవై వున్నావు" ఇలా బోధించాక పావనుడు తన స్వస్వరూప జ్ఞానం పొంది శోకరహితుడయ్యాడు.

# దేవి ఎవరు?

- పరాశర ప్రసాద్

నారదుడు తన తండ్రి చతుర్ముఖుడిని ప్రశ్నిస్తూ "నాన్నగారూ! ఈ సృష్టికర్త ఎవరు? త్రిమూర్తులు ఎలా ఉద్భవించారు?" అన్న ప్రశ్నకు సమాధానంగా బ్రహ్మదేవుడు వివరిస్తూ .....

"ఒకనాడు సృష్టి అంతా జలమయమైంది. నేను ఆ నీటిలో నుండి పుట్టిన తామరపువ్వు నుండి పుట్టాను. చుట్టూ పరికించి చూశాను. అంతా జలమయం. నన్ను పుట్టించినది ఎవరు? నీరు ఎలా నిలబడింది? నేల కనిపించదేమి? అని వేయి సంవత్సరాలు వెదుకులాడాను. చివరకు 'తప', 'తప' అంటే తపస్సు చెయ్యి అని అశరీరవాణి వినిపించింది. నేను పుట్టిన పద్మంలోనే కూర్చుని వేయి సంవత్సరాలు తపస్సు చేశాను.

ఇంతలో 'సృజ' అంటే సృష్టించు అనే మాట వినబడింది. సృష్టి ఎలా చేయాలి? సాధన ఏది? అని అనుకోగానే, మధు కైటభులు అనే ఇద్దరు రాక్షసులు నీటిలో ఈదుకుంటూ వచ్చారు. నన్ను వారితో యుద్ధం చేయమన్నారు. లేకపోతే చంపుతామని బెదిరించారు. భయపడి తామర కాడ లోపలికి వెళ్ళిపోయాను. అక్కడ పీతాంబరధారుడు, శేషశయనుడై యోగనిద్రలో ఉన్నాడు. ఆయనను మేల్కొలపటం సామాన్య విషయం కాదు. యోగనిద్రాదేవిని ప్రార్థించిన మీదట, ఆయన మేల్కొని ఆ రాక్షసులిద్దరినీ సంహరించాడు.

ఇంతలో రుద్రుడు అక్కడకు రావటం తటస్థించింది. ముగ్గురం కలిసి పరాశక్తిని ప్రార్థించాము. ఆమెను వేడుకున్నాము. అంతా జలమయంగా ఉన్నది. సృష్టికార్యం నిర్వహించటానికి భూతగణాలు, తన్మాత్రలు, ఇంద్రియాలు అనే ఉపకరణాలు కావాలి కదా అని మేము ఉచ్ఛరించేసరికి ఒక దివ్యవిమానం ఆకాశం నుండి మా ముందుకు వచ్చింది. మేము ఆ విమానం ఎక్కి కూర్చున్నాము. వెంటనే ఆ విమానం పైకి ఎగిరి సముద్ర శూన్యమైన ప్రదేశం చేరింది. అది ఒక అందమైన నందనవనం. కామధేనువు, కల్పవృక్షం, ఇంద్రుడు, ఐరావతం, అప్సరసలు, గంధర్వులు, కుబేరాదులతో కళకళ లాడుతోంది. అది బ్రహ్మలోకం. అక్కడ ఒక బ్రహ్మ ఉన్నాడు. మా ముగ్గురికీ ఆశ్చర్యం వేసింది.

ఆ విమానం అక్కడి నుండి వెండి కొండకు చేరింది. అక్కడి

దృశ్యం మా ముగ్గురినీ ఆశ్చర్యపరచింది. అక్కడ శివుడు వృషభవాహనుడై, పార్వతితో, ఇద్దరు కుమారులతో మాకు దర్శనమిచ్చాడు.

అక్కడి నుండి విమానం వైకుంఠం చేరుకున్నది. శ్రీలక్ష్మీ సమేతుడై విష్ణుమూర్తి మాకు దర్శనమిచ్చాడు. ఆశ్చర్యంలో మునిగిపోయి ఉన్న మమ్మల్ని ఆ విమానం ఎగిరి పాలసముద్రానికి చేర్చింది.

ఆ సముద్రంలో ఒక ద్వీపం కనిపించింది. ఆ ద్వీపం నడుమ ఒక దివ్యమూర్తి దర్శనమిచ్చింది. ఆమె ఒక యంత్ర పీఠంపై ఆసీనురాలై ఉన్నది. ఆ పీఠానికి ఆరుకోణాలు ఉన్నాయి. ఆమె పాశము, అంకుశము, బాణాలు, చెరకు విల్లు ధరించి ఉన్నది. "ఈ దేవి ఎవరు?" అని మేము ముగ్గురమూ పరికించి చూశాము. ఆమెకు వేయి చేతులు, వేయి కన్నులు ఉన్నాయి.

ఇంతలో విష్ణుమూర్తి మాట్లాడుతూ "వినండి ఈవిడ మనలను పుట్టించిన జగన్మాత. జగమంతా నిండి ఉన్నది. పరాశక్తి. వేదమూర్తి. ఆనందమయి. లోకమాత. నాకు జ్ఞప్తికి వచ్చింది. పూర్వం జలముపై తేలియాడుతున్న మర్రి ఆకుపై బొటనవ్రేలు నోటనుంచుకుని పాలకోసం అలమటిస్తున్న నన్ను చేరదీసి కాపాడిన తల్లి. ఆశ్రిత కల్పవల్లి. " అని చెప్పి, ముగ్గురమూ కలిసి ఆ తల్లి జగన్మాత దర్శనానికి వెళ్ళాము.

విచిత్రం! ముగ్గురమూ స్త్రీలుగా అయిపోయాము. అంతకన్న ఆశ్చర్యకరమైన విషయం!! ఆ జగజ్జనని కాలిగోటిలో మేము ముగ్గురమూ, సూర్య చంద్రులు, తారాగ్రసంతతి, నింగి, నేల, సముద్రము, పర్వతాలు అన్నీ గోచరించాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే చతుర్ముఖుడు, తామర పువ్వు, దాని కాడ, విష్ణువు శేషపాన్పు అన్నీ జగజ్జనని గోరులో గోచరిస్తున్నాయి. త్రిమూర్తులు ముగ్గురూ జగన్మాతను ప్రశ్నిస్తూ "మేము ముగ్గురమూ స్త్రీలము, మరి నీవు పురుషుడవా? స్త్రీవా?" అన్న ప్రశ్నకు సమాధానం చెపుతూ '.నేనే స్త్రీని, పురుషుడను, నా ఆంతర్యం ఎరుకగలవానికే తెలుస్తుంది. వాడే ముక్త పురుషుడు. నాకు భిన్నంగా ఏదీ లేదు. అంతటా ఉన్నది నేనే. **ఏకమేవ అద్వితీయం బ్రహ్మ** - అన్న వాక్యానికి అర్థం నేనే" అన్నది జగజ్జనని.

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషమ్నా ప్రసాద

## నిర్వాణ ప్రకరణము

వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునితో యిలా సంభాషించాడు "ఓ రామా! వొకే వస్తువు వొక సమయంలో బాధను, మరొక సమయంలో ఆనందాన్నిస్తుంది. వుదాహరణకు, వొక వ్యక్తి ఆరోగ్యంగా వున్నప్పుడు పాలు త్రాగితే ఆనందంగా వుంటుంది, అదే పాలు జ్వరము, అజీర్తి విరోచనాలు అయ్యేటప్పుడిస్తే, వాంతులయి బాధిస్తుంది. ఇది అందరి యొక్క అనుభవమే, ఎప్పుడు నీకు వొక వస్తువును పొందాలని కోరిక కలుగుతుందో, అప్పుడా వస్తువు నీకానందాన్ని యిస్తుంది. అందువల్ల, ఆనందానికి కారణము కోరిక, ఆ వస్తువు వలన పొందిన ఆనందము తాత్కాలిక సంతృప్తినిస్తుంది. సంతృప్తిని పొందాక, ఆ వస్తువు పైనున్న ఆకర్షణ తొలగి పోతుందా, దానికోసం ఆరాటపడదు".



"తాత్కాలిక సుఖాల కోసం వెంపరలాడటము కేవలము మూర్ఖత్వం, ఓ రామా! అన్ని కోరికలను, ఆలోచనలను నిర్మూలం చేసుకో మనసు వస్తువులతో అనుబంధము పెంచుకోకూడదు. ఆత్మ జ్ఞానము లేని వాడు బంధితుడు, ఆత్మ జ్ఞాన సంపన్నుడు బంధరహితుడు కనుక ఓ రామా! మనసు సదా, ప్రగాఢంగా బ్రహ్మముపై లగ్నముచేసి, యేకాగ్ర ధ్యానముతో బ్రహ్మజ్ఞానమును పొందాలి.'

"ఈ మనసు చాలా తుంటరిది, మోసకారి మనసే బంధానికి, మోక్షానికి కారణం, అదెప్పుడూ చలిస్తూనే వుంటుంది. అది వొక తృటి కాలంలో, పాతాళం నుంచి, గగనానికెగర గలదు మనసుకు, వొక క్షణంలో యీ ప్రపంచాన్నంతా సృజించే శక్తి, విధ్వంసం చేసే శక్తి వున్నది. మనసు యొక్క చపలత్వము వలనే మాయ జనిస్తుంది అవిద్య లేక అజ్ఞానము యొక్క ఫలితమే మనసు."

"ఓ రామా! వాసనారాహిత్యము వలన, లేక ప్రాణాన్ని నిగ్రహించటం వలన మనసును నిర్మూలం చేయవచ్చు. మనసు కేవలం వాసనల యొక్క సమూహం, వాసనలను నాశనం చేస్తే మనసుకు వునికే లేదు మనసు యొక్క విస్తరణ, సంకోచము వలన యీ ప్రపంచము యొక్క విన్యాసము, విధ్వంసము జరుగుచున్నది. అందుచేత వృత్తులు లేక సంకల్పాలు లేక

ఆలోచనా తరంగము నడుపులో పెట్టటం వలన మనసు యొక్క క్రియాకలాపము నరికట్టవచ్చు, ప్రాణము యొక్క కదలిక వలన మనసుకు కదలిక వస్తుంది. ఈ ప్రపంచ వ్యవహారమంతా శ్వాస వలనే జరుగుతుంది, ఆగుతుంది. ప్రాణాయామ సాధన వలన శ్వాసను క్రమబద్ధం చేయటం, నిగ్రహించటము జరుగుతున్నది. మనసును విధ్వంసము చేస్తే అవధులు లేని నిత్యానందమును పొందగలవు, దృష్టి, దృశ్యము ద్రష్టలో లీనమయితే, జ్ఞాత్, జ్ఞేయము, జ్ఞానము వొకటైతే, అంటే త్రిపుటి లయము జరిగితే, ఆత్మ యొక్క మహోన్నతమైన శాంతిని గ్రహిస్తావు."

"కోరికల విసర్జన, శ్వాస నియంత్రణ, సక్రమమైన విచారాణ వలన మనసు హృదయముల యొక్క క్రియాకలాపము సంకోచింప బడుతుంది. తద్వారా కామము, మాయ విజృంభించకుండ అరికడ్తుంది, సరియైన అవగాహన మనసు యొక్క పంచేంద్రియ ప్రలోభమును సన్నగిల్లేట్లు చేస్తుంది. సరియైన అవగాహన లేకపోతే, భౌతిక విషయాలపై పరుగిడే మనసుకు, వాటి పై ధృడత్వమునిస్తుంది. మహర్షి యొక్క మనసు మనసే కాదు (అది కాలినతాడు వంటిది) అది బ్రహ్మమే అయివుంటుంది, అది పవిత్రత యొక్క సారము, పరశువేది ద్వారా, రాగిని బంగారముగా మార్చినట్లు, ధ్యాన మార్గము ద్వారా యింద్రియ లోలత్వమైన మనసు పవిత్ర మనసుగా మారుతుంది."

"తారతమ్యాలు, భేదాలు కేవలము మనో సృజితమే వాటికి నిజమైన వునికిలేదు అశుద్ధ మనసు ప్రాపంచిక విషయాలతో క్రీడిస్తుంది, శుద్ధ మనసు బ్రహ్మము లేక పరమాత్మలోనే శాంతిగా విశ్రమిస్తుంది. వున్నది బ్రహ్మ యొక్కటే, ఆ బ్రహ్మమే మనసు ద్వారా, అనేకమవుతుంది మనసే విభజించి, భేదాలు కల్పించి, ముక్కలు చేసి, విడివిడిగా చేస్తుంది."

"మనసే మానవునకు, భగవంతునికి మధ్య విభజించే గోడలా వుంటుంది, ఇటుకలు, రాళ్ళు, సిమెంటు మిశ్రమం చేసి, మామూలు గోడను తయారు చేస్తాము కాని మనసనే గోడ వాసనలు, ఆలోచనలు, అహంకారము, యిష్టాయిష్టములతో తయారు చేయబడుతుంది. అగోచరమైన యీ గోడను, ఆత్మ విచారణ లేక ధ్యానము ద్వారా కూలగొట్టవచ్చు, తద్వారా నీవు యేకత్వమును ఐక్యతనను భవిస్తావు. 'ఒక్కటే' అనేదే సత్యము. అనేకమన్నది తాటిలోని పాములా, ఎండమావిలోని నీటిలా, స్తంభములోని దొంగలా కేవలము మిధ్య మాత్రమే."

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

మార్చి 2017

01 బుధ : శ్రీలలితానంద సరస్వతి స్వామినివారి ఆరాధన, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

12 ఆది : ఫాల్గుణ పౌర్ణమి, హోలీ,శ్రీ సద్గురు పాద పూజ.

23 గురు : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

26 ఆది : మాస శివరాత్రి,పావులూరులో ఏకాహం

28 మంగ : అమావాస్య

29 బుధ : శ్రీ హేవళంబి నామ సంవత్సర ఉగాది,ఉదయం 11గం॥లకు పంచాంగ శ్రవణం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన. ధ్యాన సప్తా శిబిరం ప్రారంభం.

ఏప్రియల్ 2017

05 బుధ - శ్రీరామనవమి - ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన

11 మంగ - పౌర్ణమ,శ్రీ సద్గురు పాద పూజ

21 శుక్ర - శ్రీ గురుదశమి- సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

25 మంగ - మాస శివరాత్రి , పావులూరులో ఏకాహం

26 బుధ - అమావాస్య

29 శని - అక్షయ తృతీయ , శ్రీ సద్గురు పాద పూజ.

30 ఆది - శ్రీశంకరాచార్య జయంతి, శ్రీసద్గురు ద్వా వింశతి (22వ)వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

'నీవు బాగున్నావా?' అని ఎవరినైనా ప్రశ్నిస్తే, వెంటనే 'నేను బాగున్నాను' అనే సమాధానం వస్తుంది. దానికి కారణం నామరూపాలతో, క్రియాగుణాలతో వేర్వేరుగా, భిన్నంగా గోచరించే జీవులన్నింటిలో ప్రకాశించే ఆత్మవస్తువు ఒక్కటే! అదే 'నేను'. వ్యవహారాలైనా, గుణాలైనా, నామ రూపాలైనా, 'నేను'ను ఆశ్రయించుకునే ఉన్నాయి.



నిజానికి 'నేను' ఉన్నాను అనే ఉనికి లేదా భావన అనుభూతి అన్ని ఒక్కటే సుమా. దానినే ఆత్మానుభూతి అని వేదాంత పరిభాషలో నిర్వచించటం జరిగింది.

అయితే 'నేను బాగున్నాను' అని సమాధానం చెప్పిన వ్యక్తిలో ఇంతటి విమర్శ లేక విచారణ వున్నదా? సందేహమే. ఇతరులకి తాను ద్వైతపదరూపుడైనా, యదార్థంగా తాను అద్వైతపదాలంకారుడే కదా!

తన స్వరూపాన్ని గుర్తించినవాడు జ్ఞాని, గుర్తించనివాడు అజ్ఞాని అనే వ్యత్యాసం వ్యావహారిక సత్యమే. కాని, పారమార్థిక సత్యం దానికి భిన్నంగా ఉంటుంది. సృష్టి విధిని ఉల్లంఘించటానికి అందరూ అశక్తులే. తన యదార్థ స్థితిని గుర్తించని సాధకుడు కర్మని అనుభవించి, ఏ జన్మకైనా గుర్తించాలన్నది సృష్టి విధి. దానికి ప్రత్యామ్నాయము లేదు. గుణ బద్ధుడైన సాధకుడు తనలోని గుణాలకు, కర్మలకు, దేహానికి సాక్షిగా వ్యవహరించినప్పుడు, ఆత్మానుభూతికి సన్నిహితుడే కదా!

వ్యాధిగ్రస్థుడు డాక్టరు దగ్గరకు వెళ్ళినప్పుడు దేహానికి చికిత్స చేస్తాడుగాని, 'నేను'కు చేయలేడు కదా! రోగి 'నాకు రోగం, నాకు రోగం' అని ఎంతగా ఆక్రోశించినా, డాక్టరు 'నీ దేహంలో ఎక్కడ నొప్పి?' అనే ప్రశ్నిస్తాడు. యదార్థంగా నొప్పి అనేది గ్రాహ్యరూపం. నొప్పి ఆత్మకూ లేదు, దేహానికీ లేదు. నేను యొక్క స్మరణ అంటే ఆత్మానుభూతికి దేహము ఒక పరికరం. నొప్పి అనేది అనుభూతి. తనని తాను గుర్తెరగనప్పుడు దేహంలో కలిగే మార్పులను గుర్తించి, అనుభూతిని పొందుతున్నాడు. అదే తనను తాను గుర్తెరిగితే దేహంలో కలిగే మార్పులకు సాక్షి మాత్రమే.

కానీ మానవ జీవితం దానికి భిన్నంగా ఉంటుంది. ఆకాశంలో

చంద్రబింబం స్థిరంగా ఉన్నప్పటికీ, కదిలే నీటిలో దాని ప్రతిబింబం చంచలంగా కనబడుతుంది. అలగే నిశ్చలమైన ఆత్మను చంచలమైన దేహం ద్వారా చూడాలనుకుంటే తాను దర్శించేది ప్రతిబింబం మాత్రమే. ఇటువంటి ఊహాభావాలతో తన జీవితం దుర్లభమని, దుర్భరమని ఊహించుకుంటూ, కనిపించని దైవమో, లేక గ్రహమో, లేక విధియో ఈ దురదృష్టాన్ని తనపై రుద్దినట్లు భావించటం సహజం.

సాధకులు తమ ధ్యేయం, తత్త్వదృష్టి, సాధనయందు విశ్వాసం లేకపోవటం, విషయాదులకు తలవంచటం కారణంగా తమ యదార్థ స్థితిని గ్రహించ లేకపోతున్నారు. దుఃఖానికి గురవుతున్నారు. బాధలు వీరిని మార్చగలుగుతాయా? విషయాదులకు కారణం విషయవాసన. దానికి కారణం త్రిగుణాత్మక ప్రవృత్తి. కాబట్టి ప్రవృత్తిని, నివృత్తిగా మార్చగలిగినప్పుడే యోగం సాధ్యం అనేది సాధకులందరూ గ్రహించాలి" అని సద్గురుదేవులు హెచ్చరించారు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

మార్చి 2017

12 ఆది : ఫాల్గుణ పౌర్ణమి, హోలీ, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

23 గురు : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు  శ్రీ సద్గురు పాద పూజ.

29 బుధ : శ్రీ హేమళంబి నామ సంవత్సరాది, ఉదయం 11గం॥లకు శ్రీ సద్గురు పాద పూజ.

ఏప్రియల్ 2017

05 బుధవారం- శ్రీరామనవమి; ఉ. 5గం. శ్రీసద్గురుపాదపూజ 11గం.లకు శ్రీసీతారాముల కళ్యాణం; పానకం వితరణ.

11 మంగళవారం - చైత్రపూర్ణిమ; రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ.

21 శుక్రవారం - శ్రీగురుదశమి - రాత్రి7గం. శ్రీసద్గురుపాదపూజ.

30 ఆదివారం- శ్రీశంకరాచార్య జయంతి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

# నా అనుభవాలు

- దాసరి కృష్ణమూర్తి (భీమవరం నాయుడుగారు)

. "శ్రీ గురుదేవులతో నాకు ఎన్నో అనుభవాలు కలిగాయి. ఈ అనుభవాలను ఎవరితోను చెప్పవద్దు, అవి నిగూఢములు - అని ఒక భక్తుడు నన్ను హెచ్చరించాడు. కాని ఎందుకో నా హృదయంలో నిక్షిప్తం చేసికొన్న కొన్ని అనుభవాలను చెప్పాలి అనిపించింది.



ధర్మం, సత్యం, న్యాయం అనేవి కరెంట్‌కి మూడు ఫేస్‌ల లాంటివి(Three phases of the current). ఏ ఫేస్ లేకపోయినా మన మనుగడ సవ్యంగా సాగదు. శ్రీబాబుగారు మహా శక్తివంతులు.

ఒకసారి లక్ష్మిగారు ఒక చిన్న బాబును ఎత్తుకుని ముద్దాడుతున్నారు. ఆ బాబు ఎంతో అందంగా ఉన్నాడు. నాకు ఒకసారి ఆ బాబును ఎత్తుకోవటానికి ఇవ్వమని అడిగితే వారు నాకు ఇచ్చారు. ఆ బాబు ఎంతో తేలికగా ఉన్నాడు. ఎంతో ముద్దొస్తున్నాడు. కొంతసేపు ఆడించాను. తరువాత ఆ బాలుడు బరువైనాడు. నేను అతనికి క్రిందకు దింపాను. లక్ష్మిగారు ఆ బాబును తనకు ఇమ్మన్నారు. నేను ఆమెకు ఇచ్చి ఆమెకేసి చూసేసరికి, ఆమె ముక్కుకు నత్తు, ముక్కుకు క్రుడి పక్క రింగు కనిపించాయి. కోటి సూర్యకాంతులతో ప్రకాశిస్తూ జగన్మాత దర్శనమిచ్చింది.

ఒకసారి బాబుగారు నన్ను పిలిచి వెంకటస్వామిగారిని పిలుచుకొని రమ్మన్నారు. నేను, 'ఆ షాహుకారు గారినా?' అన్నాను. 'తప్పు! అలా అనకుడదు' అన్నారు. నేను ఆయనను పిలుచుకొని వచ్చాను. మేము ముగ్గురం ఝుం అని గాలిలోకి పైకి తేలి సముద్రం ఒడ్డున దిగాము. పెద్ద అలలు ఎంతో ఎత్తుగా వస్తున్నాయి. నాకు భయం వేసింది. 'భయపడవద్దు' అని బాబుగారు సైగ చేశారు. ఇంతలో సముద్రంలోని అలలు గోడ కట్టినట్లుగా ఆగి మాకు దారి ఇచ్చింది. నేను నడుస్తూ నా

కాలిని చూస్తుంటే, 'ఏమిటి కాలు చూసుకుంటున్నావు?' అన్నారు శ్రీబాబు. నా కాలికి తడి అంటిందో లేదో అని చూస్తున్నాను' అన్నాను. 'తడి అంటదులే' అన్నారు. ఆ తరువాత మేము తిరిగి గాలిలో ఎగిరి సముద్రపు ఒడ్డున ఉన్న ఒక ఊరుకు వచ్చాము. 'ఇక్కడ ప్రజలలో ధర్మం, సత్యం, న్యాయం అనే మూడు ఫేస్‌లు పోయాయి. వీరికి వినాశనం తప్పదు' అనటం, ఇంతలో పెను తుఫాను వచ్చి అక్కడి వారంతా మరణించటం జరిగింది. ఇది దివి సీమలో జరిగిన భీభత్సానికి ముందు రోజున కలిగిన అనుభవం. సముద్రం అలలపైన ఎన్నో బల్బుల కాంతితో అమ్మవారు దర్శనమిచ్చింది. శ్రీబాబుగారే సృష్టి కర్త, స్థితి కర్త, లయ కర్త .

"నేను ఉడకబెట్టిన ధాన్యంతో ఉప్పుడు రవ్వ చేసి అమ్మేవాడిని. ఈ పనికి మనుషులను పెట్టాను. వారం రోజులు అయినా సరుకు తయారు కాక నష్టం వచ్చింది. బాబు గారు 'నష్టం వచ్చిందా? అందులో ధర్మం కొంచెం తక్కువయింది. దేవుడికి మొక్కుకో అంతా సరిపోతుంది." అన్నారు. అనుకున్న టైమ్‌కి సరుకు డెలివర్ చేశాను. లాభం వచ్చింది. కష్టాలలో ఉన్నవారు నా దగ్గరకు వస్తే,' నీలో న్యాయం తక్కువయింది; నీలో ధర్మం తక్కువయింది కాబట్టే నీకు ఈకష్టాలు వచ్చాయి. దేవుడికి మొక్కుకో. నీ కష్టాలు తీరిపోతాయి' అని చెప్పేవాడిని.

జీవితం నియమబద్ధంగా గడపటానికి, ఆధ్యాత్మిక ఉన్నతికి సత్యం, ధర్మం, న్యాయం అనే ఈ మూడు ఫేస్‌లు ఎంతో అవసరం. నాకు రాత్రి ఇలాంటి కలలే ఎన్నో వస్తాయి. ఈ మధ్య బాబుగారు నాకు అభయ ముద్రతో దర్శనమిచ్చి,'భయపడకు! నేను నిన్ను సదా కాపాడుతుంటాను' అని నాకు అభయం ఇచ్చారు. నాకు కొండంత ధైర్యం వచ్చింది.

శ్రీ గురుదేవులను విశ్వాసంతో కొలిచేవారికి లోటేముంది?"

# అరుణాచలం (తిరువణ్ణామలై)

సేకరణ- భోగరాజు భారతి

అరుణాచలం శ్రీఉణ్ణామలై పార్వతీసమేత అరుణాచలేశ్వర స్వామి దివ్యధామం. శ్రీకాళహస్తి, కంచి, చిదంబరం, జంబుకేశ్వరం, అరుణాచలం పంచభూత లింగ ధామములుగా పేర్కొనబడుతున్నాయి. వాటిలో అతి ప్రధానమైన అగ్నిలింగ దివ్యధామమే అరుణాచలం. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వరూపుడైన శ్రీ రమణమహర్షి, శ్రీ నీలకంఠగణపతి మహర్షి, మరెందరో మహర్షులు యుగయుగాలుగా నివసించిన శక్తి కేంద్రమే అరుణాచలం.

శ్రీగురుదేవులు శ్రీబాబూజీమహరాజ్‌వారి సాధనకాలంలో శ్రీరమణ మహర్షిని సందర్శించగా వారు ఎంతో ప్రేమతో శ్రీ బాబును తమ ప్రక్కనే కూర్చోబెట్టుకుని, నివేదన చేసుకునేవారనీ, మౌనవ్యాఖ్యతో పరబ్రహ్మ తత్త్వాన్ని వెల్లడించుకున్నారని, శ్రీబాబును శెలవు తీసుకునే సమయంలో, తమ దగ్గరకు తీసుకుని, చుబుకం నిమిరి, దరహాస వదనంతో వీడ్కోలు పలికారని **శ్రీసద్గురునాథుని చరిత్ర -1**(26వ పేజీలో) చదివియున్నాము. అందువలన ఈ క్షేత్రం గురించి, క్షేత్రజ్ఞుడి గురించి తెలుసుకోవాలనే ఆసక్తితో ఈ విషయం సేకరణ చేయటం జరిగింది.

25వేల ఎకరాలలో అరుణాచలేశ్వర స్వామి దేవాలయం నిర్మించ బడినది. ఈ ప్రాంగణంలోనే పరాశక్తి అమ్మవారు, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, చండికేశ్వరులు దర్శనమిస్తారు. దేవాలయం గోపురం 217 అడుగుల ఎత్తున నిర్మించబడినది.

ఇక్కడ సృష్టి ప్రారంభవేళ బ్రహ్మ, విష్ణువులు ఎవరు గొప్ప అంటే ఎవరు గొప్ప అని వాదించుకుంటుండగా పరమేశ్వరుడు మహాజ్యోతిర్లింగమై ఆవిర్భవించాడని ప్రతీతి. ఆకాశాన్నంటే గోపురాలతో మానవుల మనస్సును, బుద్ధిని ఆకర్షిస్తూ శివకేశవుల భేదాన్ని అధిగమించే మహాశక్తి స్వరూపుడై దర్శనమిస్తాడు స్వామి. సకల దేవతాగణాలు కూడా స్వామిని అర్చించే అర్చనా స్థలమిది.

తూర్పున ఉన్న రాజగోపురం ప్రవేశద్వారం. దీనిని శ్రీకృష్ణదేవ రాయులు నిర్మించాడు. ఇక్కడ మహాగణపతి దర్శనమిస్తాడు. కుడివైపున వెయ్యికాళ్ళ మండపం ఉంటుంది. దీనిని 500 బంగారు నాణాలు వెచ్చించి నిర్మించాడు. మండపంపైన అద్భుతమైన శిల్పములు చెక్కారు. జూన్, జులై,

డిసెంబర్ నెలల్లో అరుణాచలేశ్వరుడు ఈ మండపం మీద కొలువు తీరుతాడు. ఇక్కడ నుండి ఊరేగింపులు జరుపబడతాయి.

ఉత్తర గోపురాన్ని అమ్మాణియమ్మ గోపురం అంటారు. ఆమె చందాలు ప్రోగుచేసి, ఈ గోపురాన్ని నిర్మింపజేసిందట. పరమేశ్వరుడే ఆ రూపంలో వుద్భవించాడని చెప్పబడుతోంది.

భూమండంలోని అన్ని పుణ్యక్షేత్రాల కన్నా పూర్వమే, 40 కోణాలు కలిగిన శ్రీచక్రమే అరుణాచల పుణ్యక్షేత్రంగా ఆవిర్భవించినదని, మేరుశిఖరమే ఈ రూపంగా మారిందని, అరుణాచలేశ్వరుడు కొండపైన గల వటవృక్షం క్రింద సంచరిస్తూ ఉంటాడని శ్రీరమణమహర్షి చెప్పారంటారు.

అరుణాచలంలో అరుణగిరి చుట్టూ భక్తులు పాదచారులై ప్రదక్షిణ చేస్తారు. దీనిని 'గిరి ప్రదక్షిణ మహోత్సవం' అంటారు. 'గిరివాలం' అని కూడా అంటారు. ఇది ప్రతి పౌర్ణమిరోజూ జరుగుతుంది. గిరిప్రదక్షిణ సమస్త సృష్టి స్వరూపుడి ప్రదక్షిణగా భావించబడుతుంది. 14 కి.మీ దురం నడుస్తూ, అష్ట దిక్పాలక శివలింగ ధామాలను దర్శించడం అతి ప్రధానమైనది. 41/2 గంటలు సుమారుగా పడుతుంది. గిరి ప్రదక్షిణలో యమలింగం, సూర్యలింగం, వాయులింగం, కుబేరలింగం, ఇంద్రలింగం, ఈశాన్యలింగం, గణపతిరూప నైరుతిలింగం, వరుణలింగం వరుసగా దర్శనమిస్తాయి.

కార్తీక పౌర్ణమి రోజున కృత్తిక నక్షత్రం చంద్రుడికి అతి దగ్గరగా వస్తుంది. ఆరోజున అరుణాచలేశ్వరునికి ఎదురుగా ఉండే అరుణగిరిపైన ప్రతిసంవత్సరం 'కృత్తికా దీప మహోత్సవం' బ్రహ్మోత్సవంగా జరుగుతుంది. ఒకొక్క సంవత్సరం ఆ నక్షత్రం దగ్గరగా రాకపోవటం వలన తరువాత నెలలో ఈ ఉత్సవం జరుపుతారు. అరుణగిరిపై 2668 అడుగుల ఎత్తున 200కిలోల రాగిపాత్రలో 2500 కిలోల నేతిలో, 1000 అడుగుల ఒత్తిని, కర్పూరం వేసి, పరాశక్తి అమ్మవారికి దీపాన్ని వెలిగిస్తారు. ఈ దీపోత్సవం ప్రదోషవేళ జరుగుతుంది. 14కి.మీ దురం వరకు ఈ దీపం కనిపిస్తుంది. కొండను అన్నివైపుల నుండి భక్తులు అధిరోహిస్తారు.

శ్రీరమణాశ్రమం, శ్రీ స్కందాశ్రమం, వినాయకుడి రూపంలో వుండే కొండ, శివుని ముఖాకృతి, పైన కిరీటాకృతిలో వుండేకొండ, నేరణ్ణామలై ఆలయం, పార్వతీదేవి తపస్సు చేసిన స్థలం, ఆభీతకుచలాంబ ఆలయం, అణ్ణామలై అమ్మాణీ ఆలయం, పచ్చియమ్మ కోవెల ముఖ్యమై ప్రదేశాలు.

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

ద్వితీయాశ్వాసము - 99 శ్లో॥

**యజ్ఞై రీజిమహే, ధనం దధిమహే పత్రేషు నూనం వయం।**
**వృద్ధానీజమహే, తపశ్చ కమహే జన్మాతరే దుశ్చరమ్।**
**యేనస్మాకమభూత దన్యసులభా భక్తిర్భవ ద్వేషిణీ**
**చాణూర ద్విషి భక్త కల్మష ముషి శ్రేయః పుషి శ్రీజుషి॥**

తాత్పర్యము -



వేమము పూర్వజన్మమునందు యజ్ఞములు చేసితిమి, పాత్రత కలిగినవారికి ధనమును యిచ్చియుంటిమి, నిజముగా జ్ఞానులను సేవించితిమి. జన్మాంతరమందు దుశ్చర్యమైన తప్పసును చేసితిమి. ఏ హేతువుచేత మేము భక్తుల పాపములను హరించువాడను, సంపదలను కాపాడు లక్ష్మిని పొందినవాడగు శ్రీకృష్ణుని సర్వవిధముల చేత ఇందులకు యాచించున్నాను (దేనికనగా) చిరునవ్వుచేత, సరసమై సుందరమై చంద్రబింబము వంటి మోముగలవాడు, నందుడు చేసిన పుణ్యరాసి యగు శ్రీకృష్ణుని యందు నాకు విశేష భక్తి కలుగుగాక!

**ఆధ్యాత్మిక జ్ఞానమే ప్రగతికి సోపానము.**
**అదే మానవాళిలో మహోన్నతమైన విలువలను**
**పెంపొందింపజేసే ఉత్తమ సాధనము**

- శ్రీ కాళీబాబు

# ఉదంకుని మోక్షము

- సుదర్శన

శ్రీకృష్ణుడు ధర్మరాజు అశ్వమేధయాగం ముగియగానే, తిరిగి ద్వారకకు వస్తున్నాడు. దారిలో ఉదంక మహాముని ఆశ్రమం కనిపించింది. శ్రీకృష్ణుడు రథం దిగి, పాదచారియై ముని దర్శనానికి ఆశ్రమంలోకి ప్రవేశించి, నమస్కరించాడు.

ఉదంకుడు శ్రీకృష్ణుని స్తోత్రం చేసి, కుశల ప్రశ్నలు వేస్తూ "ప్రభూ! కౌరవ పాండవులు విరోధ భావనతో ఉన్నారని విన్నాను. మీ అనుగ్రహంతో వారుభయులూ అన్యోన్య వాత్సల్యంతో, సుఖంగా ఉన్నారా? మీరెక్కడ వుంటే అక్కడ శాంతి సుఖము సౌఖ్యము వర్ధిల్లుతాయి కదా!" అన్నాడు.

దానికి సమాధానంగా శ్రీకృష్ణుడు "ఓ మునిపుంగవా! నేను చేయవలసినదంతా చేశాను. లాభం లేకపోయింది. కౌరవులు నా హిత వచనాలను వినక యుద్ధానికి తలపడి, సర్వనాశనమయ్యారు. భీష్మ, విదుర, అక్రూరాదుల మాటలను కూడా పెడచెవిని పెట్టారు. మీకు బాగా తెలిసే ఉంటుంది, తెలివితేటలుగానీ, బలపరాక్రమాలు గానీ ప్రారబ్ధాన్ని తప్పించలేవు కదా! పాండవులు అయిదుగురు మాత్రమే మిగిలారు. వారి బంధువులు, స్నేహితులు, చివరకు వారి పుత్రులు కూడా యుద్ధంలో మరణించారు" అన్నాడు.

ఈ మాటలు వినగానే ఉందక ముని ఉగ్రుడై "ఓ కృష్ణా! ఈ వినాశానికి నువ్వే కారకుడవు. నిజంగా నీవు నీ శక్తులను వినియోగించి ఉంటే ఇలా జరిగి ఉండదు. పైగా నీ దివ్య శక్తులతో వారిని వంచించి, మృత్యువులోకి నీవే త్రోసి ఉంటావు. - ఇదిగో ఇప్పుడే నిన్ను ఘోరం శాపంతో శిక్షిస్తాను" అన్నాడు.

దానికి శ్రీకృష్ణుడు మందహాసం చేస్తూ "ఓ ముని శ్రేష్ఠా! నీవెలా తలిస్తే అలానే చెయ్యి. కాని ముందుగా నా సమాధానాన్ని శాంతచిత్తుడవై వినమని కోరుతున్నాను. నన్ను ఏ శాపమూ ఏమీ చేయలేదు. పైగా నన్ను శపించినవారే నష్టపోతారు. అనేక జన్మల నుండి వస్తున్న వారి తపశ్శక్తి అంతా నశించిపోతుంది" అన్నాడు. ఉదంకుడు కాస్త నెమ్మదించాడు.

శ్రీకృష్ణుడు పరమోత్తమమైన వేదాంత తత్త్వాన్ని విశదపరుస్తూ "ఆ పరబ్రహ్మ స్వరూపుణ్ణి నేనే!" అంటూ తన విశ్వరూపాన్ని ఉందుకునికి చూపించాడు.

ఉదంకుడు ఆ తేజస్సుకు తట్టుకోలేక, స్వామిని తన స్వరూపాన్ని ఉపసంహరించుకోమని వేడుకున్నాడు. శ్రీకృష్ణుడు తిరిగి యథా రూపాన్ని పొంది, "ఉదంకా! ఏదైనా వరం కోరుకో. ఇస్తాను" అన్నాడు. "కృష్ణా ఎడారిలో నిన్ను స్మరించగానే నాకు మంచినీళ్ళు లభించే టట్లుగా అనుగ్రహించు" అని కోరుకున్నాడు. "అలాగే జరుగు గాక! ఆ సమయంలో నన్ను స్మరించు. నీకు మంచినేళ్ళే కాక, శుభం కూడా కలుగుతుంది" అని వరమిచ్చి వెళ్ళిపోయాడు.

కొంత కాలం గడిచిపోయింది. ఒకరోజు ఉందకుడు ప్రయాణిస్తూ దారిలో మంచినీటికై తపించి, వరం గుర్తుకు వచ్చి, శ్రీకృష్ణుని స్మరించాడు. వెంటనే ఉదంకునికి కొన్ని గజాల దూరంలో ఒక గుంట కనబడింది. అక్కడే విల్లు బాణాలు ధరించిన బోయవాడు ఉన్నాడు. ఆ బోయవాడు ఉదంకుని చూడగానే "ఓ మునీ! ఈ నీటితో నీ దాహం తీర్చుకో. నా చేతులతో నీకు నీరు పోస్తాను" అన్నాడు.

ఉదంకుడు నీటిని చూసి సంతోషించాడు. వెంటనే చండాల రూపం చూసి అసహ్యించుకుని, ఆగ్రహంతో అతనిని నిందించాడు. వేటగాడు ఆ మాటలు పట్టించుకోకుండా తిరిగి ఉదంకుని నీటికై ఆహ్వానించాడు. కాని, ఉదంకుడు ఆ నీటిని తిరస్కరించి ముందుకు సాగిపోయాడు. ఉదంకుడు చూస్తుండగానే, వెంటనే వేటగాడు, గుంట కూడా అదృశ్యమయ్యాయి.

ఉదంకుడు ఇదంతా కృష్ణుని మాయయే అనుకున్నాడు. అన్నదమ్ముల మధ్య వైరాన్ని పెంచిన శ్రీకృష్ణుడు ఎన్ని మాయలైనా చేయ గలడు అని కూడా అనుకున్నాడు. ఆ క్షణంలోనే శంఖుచక్ర గదా ధరుడైన విష్ణుమూర్తి (శ్రీకృష్ణుడు) అటుగా వస్తున్నాడు. ఉదంకుడు ఎదురుగా పరుగెత్తుతూ ఆగ్రహంతో "నీకిది న్యాయమేనా? నాలాంటి బ్రాహ్మణుడికి ఆ చండాలునితో నీటిని ఇప్పిస్తావా?" అని గద్దించాడు.

శ్రీకృష్ణుడు నవ్వుతూ "నీవు నన్ను స్మరించగానే ఇంద్రుని నీకు అమృతం ఇవ్వమని పంపించాను. ఇంద్రుడు నా మాటను కాదనలేక ఒక షరుతు మీద అంగీకరించాడు. ఏమిటంటే అది - 'తనంతట తాను వద్దని వెళ్ళిపోతే అమృతం అతనికి నేను ఇవ్వను' అని.

అలాగే నీవు వద్దన్నావు. ఆ వేటగాడే ఇంద్రుడు. ఆ నీళ్ళే అమృతం. సకల శాస్త్రాలు తెలిసిన నీవు ఒక కడజాతి వాణ్ణి చూసి అసహ్యించుకోవు

అనుకొని, ఇంద్రుడు ఆ వేషంలో నీ దగ్గరకు వచ్చాడు. కానీ సామాన్య మానవుడిలాగ ప్రవర్తించి అతణ్ణి అసహ్యించుకుని అమృతాన్ని కాలదన్నావు. అందువల్ల నీకు అమృతం త్రాగి శాశ్వతంగా ఆకలి దప్పికల బాధ నుండి విముక్తిని పొందే అదృష్టం తప్పిపోయింది.

ఇప్పుడు తెలిసింది కదా! దోషం ఎవరిదో? నేను నీకు అమృతం ఇవ్వాలని సంకల్పించినా కూడా నీవు విజయం పొందలేక పోయావు" అన్నాడు.

ఉదంకుడు "నేనెంతో దురదృష్టవంతుణ్ణి" అంటూ చాలా బాధ పడ్డాడు. "పరితపించ వద్దు" అంటూ శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు ..."నేను నీకు తిరిగి మరొక వరం ఇస్తున్నాను. నీవు నన్ను ఎప్పుడు ఎక్కడ స్మరిస్తే అప్పుడు అక్కడ మేఘాలుపడి వర్షం కురుస్తుంది. అంతేకాక ఈనాటి నుండి అకాలంలో వచ్చే మేఘాలను 'ఉదంకుని మేఘాలు' అని పిలుస్తారు" అంటూ దయామయుడైన శ్రీకృష్ణుడు అదృశ్యమయ్యాడు!!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

మార్చి 2017

12 ఆది : ఫాల్గుణ పౌర్ణమి, హెూలీ, ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

23 గురు : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

29 బుధ : శ్రీ హేమళంబి నామ సంవత్సర ఉగాది, ఉదయం 11గం॥లకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

ఏప్రియల్ 2017

05 బుధవారం - శ్రీరామనవమి,సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

11 మంగళవారం - చైత్ర పూర్ణిమ; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, భక్తసమారాధన.

21 శుక్రవారం - శ్రీగురుదశమి; సా.5-30 ని॥లకు శ్రీ సద్గురు పాదపూజ.

30 ఆదివారం - శ్రీశంకరాచార్య జయంతి, ఉదయం11 గం॥లకు శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

(గత సంచిక తరువాయి) **విశ్వామిత్రుడు** - రమణ ప్రసాద్

ఆ సమయంలో త్రిశంకుడన పేరు గల ఇక్ష్వాకు వంశపు రాజు కైలాసం చేరేందుకు యజ్ఞం తలపెట్టి వసిష్ఠుని అతని పుత్రులను కోరగా వారు నిరాకరించి చండాలుడువుకమ్మని శపించారు.



అతడు విశ్వామిత్రుని వద్దకు రాగా "అట్టి యాగాన్ని నేను చేయిస్తాను" అని ఊరడించాడు. తనను నిందించిన వసిష్ఠ పుత్రులను సప్త శత జన్మములు నీచజాతిలో పుట్టి, విరూపులై, మృత శునక మాంస భక్షకులవుతారని తీవ్రమైన శాపం ఇచ్చి విశ్వామిత్రుడు ఋషులతో యజ్ఞం ప్రారంభించాడు. కాని హవిర్భాగం తీసికోవటానికి దేవతలు రాలేదు.

అప్పుడు విశ్వామిత్రుడు తన తపోశక్తితో త్రిశంకుని సశరీరంతో స్వర్గానికి పంపాడు. ఇంద్రుడు ఒక చండాలుడు స్వర్గంలో ఉండరాదని అతనిని తలక్రిందులుగా క్రిందికి త్రోయించాడు. త్రిశంకుడు, "రక్ష! రక్ష" అని విలపింపగా గాధేయుడు కరుణాళుడై, తీవ్రరోషంతో ప్రజాపతివలె తన తపః ప్రభావంతో త్రిశంకుని కోసం స్వర్గాన్ని,నక్షత్రాలను, సప్తఋషులను, సురలను, ఇంద్రుని సృష్టి చేశాడు. అలా త్రిశంకునకు శాశ్వతమైన స్థానం ప్రసాదించి బ్రహ్మర్షిత్వంకోసం పుష్కర తీరంలో తపస్సు చేయసాగాడు. అలా వేయు సంవత్సరాలు తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి ఋషిత్వాన్ని పొందాడు.

తన తపోనిష్ఠ కొనసాగిస్తుండగా, ఆయన తపోభంగం చేయటానికి ఇంద్రుడు మేనకను పంపాడు. విశ్వామిత్రుడు ఆమె వలలో పడ్డాడు. ఆమె గర్భం ధరించి శకుంతలను కన్నది. విశ్వామిత్రుడు వివేకియై తపస్సు చేయటానికి వెళ్ళిపోయాడు. మేనక పుత్రికను విడిచి స్వర్గలోకానికి వెళ్ళిపోయింది. దయాళువైన కణ్వ మహర్షి ఆ బాలికను పెంచి పెద్ద చేశాడు. ఆమెయే దుష్యంతుని భార్యయై భరత చక్రవర్తిని

కన్నది.

విశ్వామిత్రుడు వేయి సంవత్సరాలు ఘోర తపస్సు చేయగా, బ్రహ్మ ప్రత్యక్షమై, అతనికి మహర్షిత్వాన్ని ఇచ్చాడు. బ్రహ్మర్షిత్వము లభించేదాకా తపస్సు చేయ నిశ్చయించుకొని మహోగ్ర తపస్సు చేయుచుండగా , అతని తపోవిఘ్నమునకు ఇంద్రుడు రంభను పంపాడు. కాని రంభను చూసి నిర్మోహుడై, పదివేల సంవత్సరాలు రాయియై ఉండమని రంభను శపించాడు. ఆమె తరుణోపాయము కోరగా, "వసిష్ఠుని వల్ల నీకు శాపవిమోచనం అవుతుంద"నిచెప్పి సిద్ధాశ్రమంలో తపస్సు చేయసాగాడు. బ్రహ్మ హంసవాహనారూఢుడై వచ్చి అతనికి బ్రహ్మర్షిత్వము, దీర్ఘాయువు, బ్రహ్మ తేజమును ప్రసాదించాడు.

తన బ్రహ్మర్షిత్వాన్ని వసిష్ఠుడు అంగీకరించాలనే పట్టుదలతో వసిష్ఠుని వద్దకు వెళ్తే ఆయన, "ఓయి! రాజా!" అని పిలిచాడు. కొంతకాలం తపస్సు చేసిన తరువాత వసిష్ఠుని వద్దకు వెళ్ళి నమస్కరిస్తే, ఆయన "ఓయీ! ఋషీ" అని సంబోధించాడు. విశ్వామిత్రుడు ఓర్పుతో ఇంకొకమారు ప్రయత్నించగా,"రాజర్షీ!" అని పిలిచాడు. విశ్వామిత్రుడు చలించక వసిష్ఠుని పాదపద్మములను వీడకుండా ఉంటే ఆయన కౌగలించుకొని,"ఓయీ! బ్రహ్మర్షీ! లెమ్ము" అని దీవించాడు.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుడి రాజ్యాన్ని తీసికొని,అతని భార్యయైన ఇందుమతిని కరత్రో చావమోది నగరాన్నుండి వెళ్ళగొట్టగా, విశ్వేదేవతలు అతని కఠినత్వానికి అతనిని నిందించారు. "ఓ దేవతలారా! మనుష్య పక్షపాతులై నన్ను మీరు నిందించారు కనుక మీరు మనుష్యులై పుడతారు" అని శాపం ఇచ్చాడు. వారు తరుణోపాయము కోరగా, "మీరు అల్పాయిష్కులై దేవలోకానికి చేరతారు" అని చెప్పాడు. వారైదుగురు ద్రౌపది గర్భాన పంచ పాండవులకు పుట్టి అల్పాయుష్కులై చచ్చి స్వర్గానికి చేరారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

బెజవాడలో "పున్నమ్మతోట" బందరు రోడ్డులో ఉన్నది. అక్కడ ఒక చిన్న ఆశ్రమం ఉంది. శ్రీ రాఘవరావుగారు దానిని చూసుకుంటూ ఉండేవారు. శ్రీ బాబు రాఘవరావుగారిని, అమ్మమ్మగారిని, వేణమ్మను తీసుకొని ఒకసారి ఆ తోటకు వెళ్ళి అక్కడ 10,15 రోజులున్నారు. కొంతమంది భక్తులు పోతునూరు నుండి గుండుగొలను నుండి కూడా వచ్చారు. ప్రతిరోజు పూజ, తీర్థ, ప్రసాదములతో బాటు తప్పకుండా శ్రీబాబు బోధను అందించేవారు. వారు అక్కడ ఉండగానే, ఒకరోజు శ్రీబాబు వెళ్ళి పరశు రామయ్యగారి ధర్మపత్ని అయిన చుక్కమ్మగారిని ( అమ్మన్న అనేవారు శ్రీబాబు) తీసుకు వచ్చారు. వేణమ్మ అమ్మన్నగారికి మడిగా వంట చేసిపెట్టేది.



అమ్మన్నగారు శ్రీ బాబును గురించి అక్కడ భక్తులతో చెబుతూ, "ఎంతో చిన్న వయస్సులోనే యనమదుర్రులో బాబు మా యింటికి వచ్చారు. వారు బ్రహ్మజ్ఞానం మూర్తీభవించినవారు, ఎవరికీ దొరకని పెన్నిధి. సాక్షాత్తు శ్రీరామచంద్రుడే. కాని, క్షణంలో మనల్ని మాయలో పడవేయగల నేర్పరి. నిష్కల్మషమైన మనస్సుతో ఆశ్రయిస్తే మాత్రం బంగారుకొండ. ఈ సేవ మీకు లభించటం మీ అందరి అదృష్టం. అది ఎన్నో జన్మల సుకృత ఫలం. వీణ్ణి ఎన్నడూ వదులుకోకండి. ఏమీ తెలియనట్లు దొంగవేషాలు వేస్తాడు. మీరు మాత్రం బుట్టలో పడకండి" అన్నారు.

"ఓహో! అమ్మన్న మీదగ్గర కూడా నన్ను గురించి పురాణం చెబుతున్నదా? ఆమెకు నామీద వల్లమాలిన ప్రేమ. అందుకని ఎన్నెన్నో చెబుతూ ఉంటుంది. ఎలుకను చూపించి ఏనుగు అంటుంది. నమ్మకండి" అన్నారు. అమ్మన్నగారు "అదిగో చూశారా? ఆ మాటల్లోనే

దాగి ఉంటుంది ఆయన అసలు తత్త్వం. ఎలుకను ఎక్కిందీ వీడే; ఏనుగును రక్షించిందీ వీడే" అని అమ్మమ్మగారు అంటుంటే శ్రీబాబు ఒకటే నవ్వు.

తరువాత శ్రీబాబు శ్రీరామ తత్త్వాన్ని గురించి చాల చక్కగా వివరిస్తూ, " 'రామ' అనే పేరులో, 'ర' అగ్నిబీజము. అది మన కర్మబీజము లన్నింటిని దగ్ధం చేస్తుంది. 'మ' అమృతబీజము. అది అమృతత్త్వాన్ని ప్రసాదిస్తుంది. రామనామస్మరణ మనను పునర్జన్మ రహితులను జేసి అమృత స్వరూపులుగా మార్చే శక్తిగలది" అని చెప్పారు.

1956లో రాజమండ్రిలో శ్రీకాళీజయంతులను ప్రారంభించారు శ్రీబాబు. కవిగారు ఆ సందర్భంలోనే శ్రీబాబు అష్టోత్తర శతనామ రచన చేశారు. తరువాత సహస్రనామ స్తోత్రం కూడా వ్రాశారు. ఇంచుమించుగా నెలరోజులపాటు పూజలు జరిగాయి.

తమ భక్తులందరు ఆత్మబంధువులు అవటమేగాక, సంబంధ బాంధవ్యాల ద్వారా ఒకరికొకరు మరింత సన్నిహితులు కావాలని, అలా అందరు కలిసి ఏకమైన అవిభక్త కుటుంబంగా ఉండాలని శ్రీబాబు అభిలషించేవారు. అందువలన భక్తుల పిల్లల పెళ్ళిళ్ళు కూడా భక్తుల పిల్లలతోనే జరిగే విధంగా అనుసంధానం చేసేవారు.

"అప్పుడు దంపతులిద్దరూ ఒకే గురు చరణార విందములందు విశ్వాసం కలిగినవారై ఉంటారు. ఇకవారి సంసారిక జీవితము మూడు పువ్వులు ఆరుకాయలుగా ఉంటుంది. ఇంట్లో గురు స్మరణ చేసుకున్నా, గురుసన్నిధికి రావాలన్నా, వారికీ, వారి సంతానానికీ కూడ అభిప్రాయాలు, ఆలోచనలు, ఆదర్శాలు, ఆచరణ ఒక్కటిగా ఉంటాయి. ఇకవారికి గృహస్థాశ్రమ నిర్వహణము నల్లేరుపై బండినడక అవుతుంది."ఇది శ్రీబాబు ఆలోచన. అలాగే పిల్లల సంబంధాలను కుదిర్చేవారు.

- సశేషం

విష్ణు  కథలు

-గత సంచిక తరువాయి

# మీరాబాయి

- రమణ ప్రసాద్

కొందరు అసూయపరులు, “ఈ రాజపుత్రికకు వివాహం చేసుకోవటం ఇష్టంలేదు. అది అపకీర్తికరం” అని అనుకోవటం రాజు చెవినపడింది. రాజు తన భార్యతో “నీవు హితోపదేశం చేసి, అమ్మాయిని వివాహానికి సమ్మతించేటట్లు చేయమ”ని చెప్పాడు. రాణి కుమార్తెతో “తల్లీ! నా మాట విని ఎవరైనా రాజపుత్రుని వివాహం చేసుకో, అలా చేయకపోతే కులానికంతకు అపకీర్తి వస్తుంది. స్త్రీగా జన్మించినందుకు తగిన వరుణ్ణి పెండ్లి చేసుకొని కాపురం చేయాలి అలా చేయకపోతే మరణమే శరణ్యం కనుక నా మాటలను ఆలకించి వివాహం చేసుకో” అని చెప్పింది. మీరాబాయి “తల్లీ! నా తనువు, మనస్సు అర్పించి ఎప్పుడో వేణుగోపాలునికి అంకితమైపోయాను. నేను త్రికరణశుద్ధిగా అతని దాసనైనాను.ఇప్పుడు మరొకరిని ఎలా వివాహమాడేది?” అని ప్రత్యుత్తరం ఇచ్చింది. రాణి కుమార్తె మాటలను రాజుకు చెప్పింది.



ఇక ఇలా పనికాదని మీరా తల్లితండ్రులు మీరాకు బలవంతంగా మేవాడ్‌లోని రాజా సాంగ జ్యేష్ఠ పుత్రుడైన భోజరాజుతో వివాహం చేశారు. ఆమె వివాహం పదహారేళ్ళ ప్రాయంలో జరిగింది. మీరా అది భగవన్నిర్ణయంగా భావించి తల ఒగ్గింది.

వివాహం అయిన తరువాత మీరా తన ఆరాధ్య దైవమైన కృష్ణ విగ్రహాన్ని తనతో అత్తవారి ఇంటికి తీసుకొనిపోయి, ఆ విగ్రహాన్ని ఒక

మందిరంలో ప్రతిష్టించి, రాత్రింబవళ్ళు ఆ మూర్తిని సేవిస్తూ కాలం గడుపుతోంది. అలా అని ఆమె తన సతీధర్మ నిర్వహణలో లోపం రానీయలేదు.

ఆమె తన మందిరం తలుపులు మూసి తన స్వామితో ఏకాంతంగా సంభాషించేది. పాటలు పాడేది. పరవశంతో నాట్యం చేసేది. లేదా సమాధిలో ఉండిపోయేది. బయటనుండి ఆమె చేసే సంభాషణలు ఆమె ఆడపడుచు ఊదాబాయి విని తన అన్నగారైన భోజరాజుకు చెప్పింది.

గోపాలమూర్తితో ఆమె సలుపుతున్న సంభాషణలు, ఆమె పాడే పాటలు విని భోజరాజుకు కూడా అనుమానం వచ్చింది. అతడు తలుపులు తీసి చూసేసరికి మీరా సమాధిస్థితిలో, నిశ్చలంగా, అద్వితీయమైన తేజస్సుతో వెలుగుతూ ఉండటం చూసి ఆమెకు శ్రీకృష్ణుని ఎడల గల భక్తి తత్పరతను గుర్తించాడు. ఆ తర్వాత అతడు ఎన్నడూ ఆమె పూజాకార్యక్రమాలకు అడ్డు రాలేదు.

ఎప్పుడు ఏమి జరుగుతుందో ఎవరికి తెలుసు? వివాహమైన కొన్ని సంవత్సరాలకే ఆమె భర్త మరణించాడు. మీరా మామగారు ఆమెను ఆప్యాయతతో చూచుకొనేవారు. కాని ఆయన కూడా యుద్ధంలో మరణించారు. ఆమె తండ్రి కూడా యుద్ధంలో మరణించటంతో ఆమెకు ఆత్మీయులు ఎవరూ లేకపోయారు. అయినా మీరా ధైర్యాన్ని కోల్పోలేదు. కేవలం శ్రీకృష్ణుణ్ణే నమ్మి ఆ స్వామినే తన నాధుడుగా, తన సర్వస్వంగా ఎంచిన మీరాలో భక్తిప్రపత్తులు ఇంకా ఎక్కువైనాయి.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL